
ఓమ్

గణపతి రహస్యం



మట్టి గణపతి



అగ్నిహోత్ర గణపతి



ఆచార్య గణపతి

కర్త :
సువ్వార్థి
(డా. కోదూరి సుబ్బారావు)

ముద్రణ - వితరణ
ఆర్యసమాజము - సీతాఫల్‌మండి

ఓ గణపతీ!

మాకు మేధాబుద్ధిని ప్రసాదింపుము

ఓం మేధామహం ప్రథమాం బ్రహ్మణ్వతీం
బ్రహ్మజూతాం ఋషిష్టుతామ్।
ప్రపీతాం బ్రహ్మచారిభిః దేవానాం అవసే హువే॥

- అథర్వవేదం (6-108-2).


ఓ గణపతీ! జీవగణములకు పతివైన పరమేశ్వరా! ముఖ్యంగా మాకు గొప్పదైన మేధాబుద్ధినిప్రసాదింపుము. వేదవిజ్ఞానయుక్తమైనట్టియు, బ్రహ్మజ్ఞానులచే సేవింపబడునట్టియు, ఋషులచే స్తుతింపబడునట్టియు, బ్రహ్మచారులు పొందగోరునట్టియు నైన ఉత్తమ మేధస్సును మేము మాలోనికి ఆహ్వానించుచున్నాము. అది మాలోని ఆసురీ శక్తులను - కామ క్రోధ లోభాదులను వెడలగొట్టి మా దైవశక్తులను, దివ్యగుణాలను రక్షించునుగాక!

అట్టి సుమేధతో మేము నీ సత్య స్వరూపాన్ని తెలుసుకొని, నిన్నుపాసించి త్రివిధ దుఃఖాలనుండి విడివడి నీ తృతీయధామమును చేరుదుముగాక! నీలో స్వేచ్ఛగా విహరించుచు నీనుండి జ్ఞానమును, ఆనందమును పొందుచుందుము గాక!

గణపతి రహస్యం



మట్టి గణపతి



అగ్నిహోత్ర గణపతి



ఆచార్య గణపతి

కర్త :
సుమ్నార్థి
(డా. కోడూరి సుబ్బారావు)

ముద్రణ - వితరణ
ఆర్యసమాజము - సీతాఫల్‌మండి
మెయిన్ రోడ్డు, సీతాఫల్‌మండి,
సికింద్రాబాదు - 500 061. (తెలంగాణ)
ఫోన్ : 040 -27071816, 9133134156, 9246174018

వైదిక గ్రంథమాల : 7

గణపతి రహస్యం

ప్రథమ ముద్రణ : ప్రతులు 1000

సృష్టి సంవత్సరము : 1, 97, 29, 49, 117

విక్రమాబ్దము : 2072

దయనందాబ్దము : 192

శ్రీ దుర్ముఖి నామ సంవత్సరము శ్రీకృష్ణ జన్మాష్టమి (25-08-2016)

మూల్యము : మీరు పూర్తిగ చదవటం, మరొకరికి ఇవ్వటం.

ప్రతులకు :

ఆర్యసమాజము - సీతాఫల్‌మండి,

మెయిన్ రోడ్డు - సీతాఫల్‌మండి,

సికింద్రాబాదు - తెలంగాణ 500 061.

ఫోను :- 040-27071816, 9133134156, 9246174018.

Email : aryasamajsitafalmandi@gmail.com

డి.టి.పి. & ప్రింటింగ్ :

విక్రాంత్ ప్రింట్ హౌస్,

వారాసిగూడ, సికింద్రాబాద్ - 500 061.

ఫోన్ : 9705085608.

ముందుమాటలు (Foreword)

మేము గత శివరాత్రికి 'శివరాత్రిరహస్యం' అనే పేరుతో చిన్న పుస్తకం వ్రాసి ముద్రించి వితరణ చేశాము. అది చదివి పెక్కురు మమ్ము ప్రశంసించారు. క్రొత్తవారు కొందరు చదివి చాలా బాగున్నదన్నారు. చదివిన వారిలో ఉన్నత విద్యావంతులు, వివేకవంతులు కూడా ఉన్నారు. కొందరైతే నన్ను చూడగోరుచున్నారు. భువనగిరికి వస్తామంటున్నారు. నేడు లోకంలో పౌరాణిక మూఢభక్తి 99 శాతం ఆక్రమించింది. అయినా సత్యాన్ని గ్రహించగలవారు కొందరున్నందుకు సంతోషం.

ఆ ప్రోత్సాహంతోనే "గణపతి రహస్యం" పేరుతో ఒక చిన్న పుస్తకం వ్రాయాలని సంకల్పం కలిగింది. ఆరోగ్యం అనుకూలించకున్నా ఓపిక తెచ్చుకొని ఈ చిన్నపుస్తకం వ్రాశాను. ఈ పుస్తకంలోని వేదమంత్రాలకు అర్థాలు మహర్షి దయానందుల వారి వేదభాష్యంనుండి గ్రహించాను. 'అగ్నిహోత్ర గణపతి' అనే విషయంలో కొంతభాగం పం. శ్యేష్ఠవర్మన్‌గారి ముంబాయి ఆకాశవాణి కేంద్రంద్వారా 1987 లో ప్రసారమైన శ్రీగణేశ రహస్యం ప్రసంగాల నుండి గ్రహించాను. "ఆచార్య గణపతి" అనే విషయం చండీగడ్‌వాసులు డా. జగదీశ్‌శాస్త్రిగారి పుస్తకాల నుండి గ్రహించాను. ఈ మహానుభావులందరికి నా హృదయపూర్వక ధన్యవాదములు.

ఈ "గణపతి రహస్యం" అనే చిన్న పుస్తాకాన్ని కూడా మా సీతాఫల్‌మండి - ఆర్యసమాజము వారు ముద్రించి ఉచిత వితరణ చేస్తున్నందుకు కార్యవర్గానికి, సభ్యులకు నా హృదయపూర్వక ధన్యవాదములు.

- సుమ్నార్థి

(డా. కోడూరి సుబ్బారావు)

ప్రకాశకీయము

మా సమాజం ప్రచురిస్తున్న వైదిక సాహిత్యమాలలో "గణపతి రహస్యం" ఏడవ కుసుమం. గణపతి అనగా గణములకు పతి-స్వామి. రహస్యం అనగా దాగివున్నది, తెలియబడనిది అని అర్థం.

మన చుట్టూవున్న ప్రపంచం, ప్రాణులశరీరాలు పంచభూతములతో ఏర్పడినవి. కనుక పంచభూతాలు మొదటిగణము. ప్రాణ అపాన వ్యాన సమాన ఉదానమను నామములుగల పంచప్రాణాలు రెండవ గణము. పంచ జ్ఞానేంద్రియాలు మూడవ గణము. పంచ కర్మేంద్రియాలు నాలుగవ గణము. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మరియు ఆత్మ ఐదవ గణము. ఈ గణాల సమూహమే చరాచరజగత్తు. దీనిని ధరించి పాలించి పోషించేవాడు గణపతి కనుక ఈ పదము సృష్టికర్తయైన పరమేశ్వరునికే వర్తిస్తుంది.

'న తస్య ప్రతిమా అస్తి' - పరమేశ్వరునికి పరిమాణముగల ఆకారము లేదని అతడు అకాయుడని (శరీరము లేని వాడని) వేదం ఉపదేశిస్తున్నది. అట్టి సర్వవ్యాపకుడికి ఏనుగుతలతో మానవశరీరాన్ని కల్పించి భాద్రపద శు॥ చవితి నాడు హిందువులు (ఆర్యులు) అందరూ పూజిస్తున్నారు. 'యజ్' ధాతువునకుగల అర్థాలలో 'దేవపూజ' ఒకటి. వీరు జరిపే షోడశోపచార, అభిషేకాలతో నిజంగా దేవపూజ జరుగుతున్నదా అనగా దేవతలు సంస్కరింపబడుతున్నారా? శరీరమే లేనివానికి ఇద్దరు భార్యలను అంటగట్టటం ఎందుకు?

గణపతికి అగ్నిహోత్రానికి (యజ్ఞానికి) గల సంబంధమేమిటి? గణపతికి ఉన్న వివిధ నామాల విశిష్టత ఏమిటి? వ్యాసభారతము వ్రాసిన గణపతి, చవితినాడు పూజింపబడుతున్న గణపతి, ఇద్దరు ఒక్కరేనా? ఇలా వ్రాస్తూపోతే చాలా ప్రశ్నలున్నాయి. వీటన్నింటికి సమ్మార్థి డా॥ సుబ్బారావుగారు ఈ చిన్న పుస్తకం ద్వార సమాధానాలు చక్కగా వివరించారు. ఇవే కాకుండా, ఇంకా ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలిపారు.

డా॥ సుబ్బారావుగారి భాష అతి సరళము. వారి విశ్లేషణ తార్కికంగా, వైజ్ఞానికంగా, ప్రమాణయుక్తంగా ఉంటుంది. ఆరోగ్యము సహకరించకున్ననూ ఒక వైపు హోమియో వైద్యం ద్వారా ఎంతో మందికి 'ఆరోగ్యదానం' మరొకవైపు వైదిక సాహిత్యం ద్వారా 'జ్ఞానదానం' చేస్తున్న వీరి సేవా భావము, కృషి ఎంతో ప్రశంసనీయము. పరమేశ్వరుడు వీరికి మంచి ఆరోగ్యమును పూర్ణాయువును ప్రసాదించుగాక!

మునుపటివలెనే ప్రస్తుత ప్రచురణను కూడా నిఃశుల్కముగా వితరణ చేయదల్చాము. ప్రచురణకు ఆమోదం తెలిపిన అధ్యక్షులు శ్రీ డి. నర్సయ్యగారికి మరియు అంతరంగ సభాకార్యవర్గమునకు ధన్యవాదములు. చక్కగా ముద్రించి సహకరించిన విక్రాంత్ ప్రింట్ హౌస్ వారికి కూడ ధన్యవాదములు.

ఓం తత్సత్.

మీ సేవలో
డి. గంగాధర్
మంత్రి
ఆర్యసమాజము - సీతాఫల్‌మండి

సికింద్రాబాదు
12-08-2016

గణపతి రహస్యం

భాద్రపద శు. చవితి 'వినాయక చవితి' పండుగగా లోకంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. ఆ రోజు హిందువులుగా వ్యవహరింపబడు ఆర్యులంతా భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజించి, గణపతి నవరాత్రులనే పేరుతో 9 రోజులు ఉత్సవాలుగా జరుపుకుంటారు. 10వ రోజున గణపతులను జలనిమజ్జనం చేస్తారు. మా చిన్న నాటి (1950-1960) నాటి మాట-

భాద్రపద శు. తదియనాడు మధ్యాహ్నం విద్యాలయాలకు సెలవిచ్చేవారు. మరునాటి వినాయక చవితి ఏర్పాట్లు చేసుకోవటానికి పిల్లలమంతా పొలాలలోను, తోటలలోను తిరిగి మామిడాకులు, కలువ తామర పూవులు, వెలగ, మారేడు జామ మొదలగు కాయలు, మొక్కజొన్న కంకెలు మొదలగునవి సేకరించి తెచ్చుకునే వారము. చవితి నాడు వాటితో పాలవెల్లులు (పూజపీఠంపై వ్రేలాడగట్టే పందిరి లాంటివి) చక్కగా అలంకరించి, గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టేవారము. స్వర్ణకారుల యింటికి ఒక పళ్ళెరంలో స్వయంపాకం (ఒకరిద్దరికి సరిపడే బియ్యము పప్పులు ఉప్పులు మొదలగునవి) తీసుకువెళ్ళి వారికిచ్చి, క్రొత్తగా అచ్చువేసిన మట్టి గణపతులను అదే పళ్ళెరంలో పెట్టుకుని యింటికి తెచ్చేవారము. అనంతరం స్నానాలుచేసి మడిబట్టలు (సామాన్య వస్త్రాలే ఉతికి ఆరవేసినవి) కట్టుకొని పూజచేయించే పురోహితుల రాకకొరకు ఎదురుతెన్నులు చూచేవారము. ఆ రోజు పూజచేసేవరకు ఏమీ తినకూడదనే కఠిన నియమముండేది. మాకు ఉదయమే స్నానంచేసి 7 గంటలకే చద్దిఅన్నం తినే అలవాటు. అట్టిది ఆరోజు 11,12 గంటలవరకు ఏమీ తినకుండా ఉండాలంటే చాలా కష్టమనిపించేది. పూజ కాకముందే కడుపులో ఉన్న దేవుడు కనబడేవాడు. ఎట్లో ఓర్చుకుంటూ పూజచేసి భోజనం చేసేవారము. అయితే, ఒక విషయంలో మాకు ఉపశమనం ఏమిటంటే - పుస్తకాలన్నీ గణపతి దగ్గర పెట్టేముకదా! కనుక ఆ రోజు చదువుకునే పని, హోమ్‌వర్కు చేసేపని లేకపోవటం.

మధ్యాహ్నం స్నేహితుల ఇండ్లకు వెళ్ళి వాళ్ళ పూజాలంకారాలు చూసివచ్చేవారము. వారిని మా యింటికి ఆహ్వానించి మావి చూపించేవారము. సాయంత్రం పూజఅక్షంతలు నెత్తిమీద వేసుకొని చవితిచంద్రుని దర్శించి "నీలాపనిందలు రాకుండా కాపాడు" మని గణపతిని ప్రార్థించేవారము. భోజనంచేసి గుడిలో చెప్పే హరికథకు వెళ్ళేవారము. ఆ రోజులలో సంవత్సరంలో జరిగే రకరకాల పూజలలో మగవారు కూడా కూర్చొని చేసేది వినాయక చవితి పూజ ఒక్కటే ఉండేది. మిగతా పూజలన్నీ స్త్రీలే చేసేవారు.

నేడు ఆ భక్తిశ్రద్ధలు నామమాత్రమయ్యాయి. ఇంట్లోనిపూజ బజారుకెక్కింది. వీధివీధినా చందాలు వసూలుచేసి (బలవంతంగా కూడా) కొంత గణపతిపూజకు, కొంత వారి పూజకు (స్వంత ఖర్చులకు) ఖర్చు చేస్తున్నారు. ఒకరినిమించి ఒకరు (పెద్దవారు పెద్దగా, చిన్నవారు చిన్నగా) పోటీపడుతున్నారు. అంతకంతకు విగ్రహాలు పెద్దవవుతున్నాయి. గణపతుల సంఖ్య పెరుగుచున్నది. జలనిమజ్జనంకూడా పెద్దపెద్ద ఊరేగింపులుగా అట్టహాసంగా సాగి పోతున్నాయి. రకరకాల రూపాలతో గణపతి విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని జంతువుల ఆకారంలో కూడా ఉన్నాయి. ఈ వింతవింత గణపతులకు ఏ శాస్త్రాలు ఆధారమో, ఏ పూరాణాలు ఆధారమో తెలియదు. ఇంతకీ గణపతి అంటే అసలు అర్థమేమిటో తెలిసింది ఎందరికి? కనుక, ఇట్టి పరిస్థితులలో సరియైన గణపతి విజ్ఞానం తెలుపాలనే సదుద్దేశ్యంతో ఈ చిన్న పుస్తకం ప్రచురిస్తున్నాము.

మనం హిందువులమనీ, మనమతం హిందూమతమనీ పెక్కురనుకుంటారు. కాని, మనం ఆర్యులం. మన మతం వేదమతం. ఆర్యులంటే ఏ దేశంనుండో ఇక్కడకు వలస వచ్చినవారు కాదు. అసలు ఆదిమానవ సృష్టి జరిగింది ఈ దేశంలోనే. అది త్రివిష్టప పీఠభూమి. నేడు దానిని టిబెట్ అంటున్నారు. పూర్వం టిబెట్, భూటాన్, బర్మా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక అన్నీ మన దేశంలోని భాగాలే. అప్పుడు దానిని భారతవర్షం అనేవారు. సంస్కృతంలో వర్షం అంటే దేశమని అర్థం. ఇప్పటికీ మనం ధార్మిక క్రియాకలాపాలలో భరతఖండే, భారతవర్షే, ఆర్యావర్త పుణ్యభూమౌ అని సంకల్పం చెప్పుకుంటాము. ఆసియా ఖండాన్నే పూర్వం భరత ఖండం అనేవారు.

మరికొన్ని వివరాలకు నా రచన "మన ఇతిహాసం" లో చూడండి.

మతపరంగా మనం వేదమతానికి చెందినవారము. సృష్టికర్త ఆది మానవులకిచ్చిన జ్ఞాననిధులే వేదాలు. అవి ఈ దేశంలోనే ఆవిర్భవించాయి. దయామయుడైన సృష్టికర్త అత్యుత్తమ ప్రాణిగా మానవుని సృజించి, జ్ఞానగ్రహణ సామర్థ్యంగల బుద్ధిని ప్రసాదించాడు. ఇది మానవునకు 6వ జ్ఞానేంద్రియంగా - అంతరింద్రియంగా ఉంది. కన్నులు రూపాలను, చెవులు శబ్దాలను, నాలుక రుచులను గ్రహించినట్లే మన బుద్ధి జ్ఞానాన్ని గ్రహిస్తుంది. మిగిలిన జ్ఞానేంద్రియాలకు రాజుగా ఉంటుంది. అవి తెచ్చిన శబ్ద స్పర్శ రూప రస గంధాలను వివేచించి తన కవసరమైన వాటిని ఇట్టి కర్మేంద్రియాలతో స్పందించి పొందుతుంది. ధర్మాధర్మాలను, సత్యాసత్యాలను, గ్రాహ్య+అగ్రాహ్యాలను, కర్తవ్య+అకర్తవ్యాలను తెలుసుకునేది కూడా బుద్ధియే. మా పూర్వ ప్రచురణ "వేదాలలో మనోవిజ్ఞానం" ద్వారా తెలుసుకున్న గొప్ప గొప్పగుణాలన్నీ బుద్ధికుంటాయి. అది "జ్యోతిషాం జ్యోతిః ఏకం" - (యజు. 34-1) ఇంద్రియ జ్యోతుల నన్నిటికి వెలుగునిచ్చే అంతరజ్యోతి. అది ఒక్కటే అయినా మనను ఇంద్రియాలన్నిటితో కలుపుతుంది.

సృష్టికర్త అట్టి బుద్ధికి విషయంగా ఈ అద్భుతాద్భుత సృష్టిలో మానవుల కవసరమైన సమస్త విద్యలను సూత్రరూపంలో (బీజరూపంలో) వేదాల ద్వారా తెలిపాడు. వాటిలో ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవిక జ్ఞానమంతా ఉంది. అయితే అవి మంత్రాలరూపంలో ఉన్నాయి. అంటే మనన చింతన నిధిధ్యాసనలు చేసి గ్రహించవలసినవి. "మననాత్ మంత్ర ఇతి ఉచ్యతే" అని ఋషులన్నారు. కనుక మనం ముందుగా జ్ఞాననిధులైన వేదాలలో గణపతిని గురించి ఏమి చెప్పబడి ఉందో తెలుసుకునే ప్రయత్నంచేద్దాము. అనంతరం మిగిలిన ఆధ్యాత్మిక శాస్త్రాలలో ఉన్న వాటిని గురించి ఆలోచిద్దాము.

వేదాలలో గణపతి స్వరూపం

ముందుగా మనం ఋగ్వేదంలో చెప్పబడిన గణపతిని గురించి తెలుసుకుందాము.

★ ఓం గణానాం త్వా గణపతిం హవామహే
కవిం కవీనామ్+ఉపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆ నః శృణ్వన్+ఊతిభిః సీద సాదనమ్॥

- ఋగ్వేదం (2-23-1)

19 మంత్రాలు గల ఈ ఋగ్వేద ద్వితీయమండల 23వ సూక్తానికి ఋషి గృత్సమదుడు. అంటే - సృష్టికర్త సృష్ట్యాదిలో ఋగ్వేదాన్ని అగ్నినామక ('అగ్ని' అను పేరుగల) ఋషి హృదయంలో (బుద్ధిలో) ప్రకటింపగా, బ్రహ్మ అనుపేరుగల మరొక ఆది ఋషి దానిని అభ్యసింపగా, ఆ బ్రహ్మఋషివద్ద గృత్సమధుడనే ఋషి అభ్యసించి ఈ సూక్తాన్ని మనన చింతన నిధి ధ్యాసనలు చేసి, ఈ మంత్రాల అర్థాన్ని అంతర్యామి నుండి గ్రహించి తోటి మానవులకు వివరించి చెప్పాడన్న మాట. కనుక ఈ సూక్తానికి అసలు కర్త పరమేశ్వరుడు. ఈ గృత్సమధుడు ఆ మంత్రార్థాల ద్రష్ట. "ఋషయో మంత్రద్రష్టారః" అని ఋషి పదమునకు నిర్వచనం.

ఈ 19 మంత్రాలలో 6 మంత్రాలకు 'బ్రహ్మణస్పతిః' దేవత. అంటే - ఈ మంత్రాలలో బ్రహ్మాండ పతిని గురించి చెప్పబడింది. మిగిలిన 13 మంత్రాలకు 'బృహస్పతి' దేవత. ఈ పదమునకు పెద్దపతి - అని అర్థం. ఈ రెండు పదములు ఆధ్యాత్మికార్థంలో సృష్టిస్థితిలయ కర్తయైన ఏకేశ్వరునికే వర్తిస్తాయి.

గణములు అంటే - (గణ సంఖ్యానే) సమూహములని అర్థం. జీవగణములకు, ప్రకృతి గణములకు అన్నిటికి పతి (పాలకుడు, పోషకుడు, రక్షకుడు) గనుక గణపతి పదము దేవునకే వర్తిస్తుంది. అప్పుడు ఈ మంత్రార్థం ఈ విధంగా ఉంటుంది -

మంత్రార్థం : ఓ సృష్టికర్తా! సర్వాంతర్యామీ! లెక్కించతగిన సమూహము లన్నిటికి నీవే పతివి. అట్టి నిన్ను మా హృదయాలలోనికి ఆహ్వానిస్తున్నాము. కవులలో నీవు సర్వజ్ఞ కవివి. నీవు గొప్పగా కీర్తించతగిన జ్యేష్ఠరాజువు. అట్టి నిన్ను మా రక్షణకొరకు మా హృదయములలోనికి (బుద్ధులలోనికి) విచ్చేసి స్థిరముగా మాయందే ఉండగోరుచున్నాము. నిన్ను తప్ప మరొకరిని ఉపాసించకుందుముగాక!

We invoke the Omniscient, Unmatched and the Great God who always is in the mind of noble persons. We pray to Him to seek His protection and to make Him attentive to our prayers permanently.

ఇప్పుడు యజుర్వేద మంత్రాన్ని గురించి తెలుసుకుందాము.

★ ఓం గణానాం త్వా గణపతిం హవామహే,
ప్రియణాం త్వా ప్రియపతిం హవామహే।
నిధీనాం త్వా నిధిపతిం హవామహే,
వసో మమ ఆహమజాని
గర్భధమా త్వమ్+అజాసి గర్భధమ్॥

- యజుర్వేదం (23-19)

ఈ మంత్రానికి ప్రజాపతి ఋషి. గణపతి దేవత. మంత్రార్థం ఈ విధంగా ఉంటుంది -

ఓ జగదీశ్వరా! గణములమధ్య గణములను పాలించునట్టి నిన్ను ఆహ్వానించుచున్నాము. ప్రియమైన వారలలో నీవు అత్యంత ప్రియుడవు. కనుక నిన్ను ప్రశంసించుచున్నాము. నిధిపతులమధ్య నిన్ను అత్యంత నిధిపతిగా స్వీకరించుచున్నాము. సకల ప్రాణులను వసింపజేయునట్టి ఓ వసో - పరమాత్మా! నీవు అజుడవని, ఏ తల్లి గర్భంలోనికి వచ్చి జన్మించవని చక్కగా తెలుసుకుందుముగాక! సకల విశ్వమును నీ గర్భమునందే ధరించు హిరణ్యగర్భుడవని చక్కగా అర్థం చేసుకొందుముగాక!

O God ! We invoke Thee, the troop - Lord of troops. We invoke thee, the Lord of the beloved ones. We invoke Thee, the Lord of the treasure of knowledge. O God! all beings reside in thee. Thou art my judge. I know Thee full well free from birth, the

<u>Sustainer of matter that keeps the universe in womb. Thou Knowert matter!</u>

<u>వివరణ :</u> పై యజుర్వేద మంత్రం గణపతి సమస్త బ్రహ్మాండాలను, అందలి జీవగణాలను తన గర్భంలో ధరించు చున్నాడని స్పష్టంగా చెబుతోంది. ఇంతేగాక, **'అహమ్+అజాని+గర్భధమ్ త్వమ్ అజాసి'** = నీవు అజుడవని – జన్మింపని వాడవని నేను చక్కగా తెలుసుకొందును గాక! అని చెప్పుచుండగా పురాణాలలో గణపతి జన్మవృత్తాంతం రకరకాలుగా వర్ణింపబడ్డాయి.

యజుర్వేదంలోని చివరి 40వ అధ్యాయం పొరపాట్లుకు తావియ్యకుండా పరమేశ్వరుని స్వరూపాన్ని మరింత స్పష్టంగా చెబుతుంది. <u>**"ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్"**</u> ఈ సృష్టి అంతా – కించిత్ నుండి గతిశీలమైయున్న ఈ జగత్తంతా ఈశునిచే –(ఒక నియామకశక్తిచే) వ్యాపించబడి ఉందంటూ ప్రారంభించబడిన ఈ అధ్యాయం లోకంలో ఈశోపనిషత్‌గా, మొదటి ఉపనిషత్తుగా ప్రసిద్ధిని పొందింది.

ఓం తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।
తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః ॥
– యజు. (40.5)

అన్నిటిని నియమించి నడిపిస్తున్న ఆ ఈశుడు (దేవుడు) తాను కదలడు. కాని విశ్వంలోని గ్రహ గోళాల నన్నిటిని నియమ బద్ధంగా త్రిప్పుతున్నాడు. అతడు అత్యంత సమీపంలోనూ ఉన్నాడు, అత్యంత దూరంలోను ఉన్నాడు. అన్నిటి లోపలా వెలుపలా కూడా ఉన్నా డంటుంది. అతని ముఖ్యగుణగణాలను మరింత స్పష్టం చేస్తూ 8వ మంత్రంలో–

<u>**స పర్యగాత్+శుక్రమ్+అకాయమ్+అవ్రణం+అస్నావిరం శుద్ధమ్+అపాపవిద్ధమ్**</u>
= ఆ ఈశతత్త్వం అంతటా అన్నిటా వ్యాపించి ఉంది. అది సర్వ శక్తిమంతము. దానికి మనవలె శరీరం లేదు. వ్రణాది రహితం. నాడులతో బంధింపబడి సుఖదుఃఖాల ననుభవించటం లేదు. అవిద్యా, అజ్ఞానాలులేని శుద్ధమైనది.

పాపపుణ్యాల బంధనంలేనిది.

<u>కవిః + మనీషీ</u> = అది సర్వజ్ఞకవి. ఆది ఋషుల హృదయాలలో సృష్టివిజ్ఞానాన్నంతా వేదాలద్వారా ప్రకాశపరచిన అంతర్యామి. సర్వజీవుల మనోవృత్తులను తెలుసుకొనుచున్న మనీషి.

<u>పరిభూః స్వయంభూః</u> = దుష్టులను, పాపులను వారెంతటి శక్తి శాలురైనను అణచిపెట్టగల తత్త్వం. స్వయంభువుడు = లోకంలోని ప్రాణులవలె మాతా పితరులు, గర్భవాసము, జన్మవృద్ధి క్షయాములు లేని అనాది స్వరూపం. దాని ఉనికికి మరొక కారణంలేని స్వయంభువము అంటుంది. ఆ సర్వవ్యాపక తత్త్వానికే దేవుడని పేరుపెట్టి అనేక నామములతో దానిని సంబోధిస్తుంది. వర్ణిస్తుంది. వివరిస్తుంది.

★ <u>దేవుడొక్కడే నామములనేకం</u>

ఈశ్వరీయ జ్ఞానమైన నాలుగు వేదాలలోను ఏకేశ్వరుని నామములు 150 కి పైగా కనబడతాయి. ఈ నామములన్నీ వేరువేరు దేవుళ్లనుకుంటారేమోనని ఆ విషయం స్పష్టం చేస్తూ సృష్టికర్త ఏమన్నాడంటే –

✓ **ఓం ఇన్ద్రం మిత్రం వరుణమగ్ని మాహురథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్।**
<u>**ఏకం సత్+విప్రా బహుధా వదన్తి + అగ్నిం యమం మాతరిశ్వాన మాహుః॥**</u>
– ఋగ్వేదం (1-164-46)

ఓ మానవులారా! సృష్టి స్థితి లయములు చేయుచున్న సత్‌పదార్థం – నేను ఒకే ఒక్కడిని. నన్నే విప్రులు – విద్వాంసులు, జ్ఞానులు, యోగులు, మహాత్ములు అనేక నామములతో పిలుస్తారు. ఆ పేర్లన్నీ నా ఒక్కొక్క శక్తిని, గుణాన్ని సూచిస్తాయి. ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, దివ్యుడు, సుపర్ణుడు, గరుత్మంతుడు, యముడు, మాతరిశ్వుడు, గణపతి, బ్రహ్మ, విష్ణువు, శివుడు మొదలైన పేర్లన్నీ ఆధ్యాత్మిక ప్రకరణంలో నాకే వర్తిస్తాయి. భౌతికప్రకరణంలో లోకంలోని కొన్ని పదార్థాలకు, వ్యక్తులకు వర్తిస్తాయి. కనుక ప్రకరణాన్నీ – సందర్భాన్నీ గుర్తిస్తూ నేనిచ్చిన వేదాన్ని అర్థం చేసుకోవాలన్నాడు సృష్టికర్త.

"గణపతి" అంటే

దేవుని అనేక నామములలో 'గణపతి' నామము ఒకటి. ఈ పదము "గణ-సంఖ్యానే" అనే సంస్కృతమూల ధాతువుతో నిర్మింపబడింది. కనుక లెక్కించతగిన కొన్ని పదార్థాలకు లేదా వ్యక్తులకు పతి - పాలకుడు, పోషకుడు, రక్షకుడు నని అర్థం వస్తుంది. ఆధ్యాత్మిక ప్రకరణంలో (దేవుని గూర్చిన సందర్భంలో) 'గణపతి' అంటే కోటానుకోట్ల జీవులకు, విశ్వంలోని సమస్త జడపదార్థాలకు పతి - పాలకుడు కనుక ఈ పేరు సృష్టిస్థితి లయకారకుడైన ఏకేశ్వరునికే వర్తిస్తుంది.

ఆధిభౌతికార్థంలో అంటే ప్రాణులపరమైన, మానవుల పరమైన సందర్భాలలో గణపతి అంటే - కొందరికి పతి (Group Leader) అని అర్థం వస్తుంది. అతడు రాజు కావచ్చు, సేనాపతి కావచ్చు, నేటి కాలాన్నిబట్టి దేశాధిపతి కావచ్చు, పార్టీ పతి కావచ్చు (సంస్థకు పతికావచ్చు) - అంటే వాటికి అధ్యక్షుడు (President) అన్నమాట. పూర్వం గురుకులాలు ఉన్నపుడు గురుకులపతిని, కులపతిని కూడా గణపతి అనేవారట. ఈ విషయం రాబోవు ప్రకరణాలలో వివరంగా తెలుసుకుందాము.

ఇక ఆధిదైవికార్థాన్ని గురించి ఆలోచిస్తే ప్రాణు లన్నిటిని పోషిస్తూ వసింపచేస్తాయి కనుక పంచభూతాలను - పృథీవీ జల అగ్ని వాయురాకాశాలను, సూర్యచంద్ర నక్షత్రాలను గణపతులనవచ్చు. అయినప్పటికి వీటన్నిటిని మరియు సకల ప్రాణులనుకూడా కాపాడుతూ వాటికి మేలుచేస్తుంది కనుక అగ్నిహోత్రాన్ని గణపతి అనటం సమంజసంగా ఉంటుంది. ఎందుకంటే "అగ్నిర్ వై దేవానాం ముఖమ్= అగ్నిహోత్రమే జడదేవతల కన్నిటికిని ముఖంగా - నోరుగా జీర్ణమండలంగా ఉంటుంది" కనుక ఈ విషయం తదుపరి ప్రకరణంలో వివరంగా తెలుసుకుందాము.

దేవతలు ఎన్ని?

యజుర్వేదం దేవతలు 33 (త్రయస్త్రింశతా - 14-31) అంటుంది. వీటిని వివరిస్తూ మహర్షులు - "పృథివ్యాదయో అష్టావసవః, ప్రాణాదయోదశవాయవః+ జీవాత్మాచ, చైత్రాదయో ద్వాదశ మాసాః, విద్యుద్యజ్ఞశ్చ" అంటూ 33గా లెక్కించారు.

దీనిని మరికొంత వివరిస్తూ - "భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము అనే పంచ భూతాలు + సూర్య చంద్ర నక్షత్రాలు కలిసి 8 దేవతలు. వీటికి వసుదేవతలని పేరు. ఇవి ప్రాణులను వసింపచేస్తూ ఉంటాయి. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములనబడే పంచ ముఖ్య ప్రాణవాయువులు నాగ, కూర్మ, కృకల, దేవదత్త, ధనంజయము లనబడే 5 ఉపప్రాణాలు కలిసి దశవాయువులుగా లెక్కించాలి. వీటితో జీవాత్మను కూడా కలిపితే 11 అవుతాయి. వీటికి రుద్ర దేవతలని పేరు. ఎందుచేతనంటే ఇవి శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతే (ప్రాణాలు, జీవాత్మవెళ్ళిపోతే) ఆ శరీరం శవమైపోతుంది. దానితో బంధుమిత్రులంతా రోదిస్తారు. ఏడుస్తారు. కనుక (రుద-రోదనే) ఇవి 11 రుద్రదేవతలు. చైత్రము, వైశాఖము, జ్యేష్ఠము, ఆషాఢము అంటూ మనం వ్యవహరించే 12 తెలుగు నెలలకు ఆదిత్య దేవతలని పేరు. ఆదిత్యుడు - సూర్యుడు ఒక్కడే అయినా భూమి సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకారంలో తిరుగుచుండుటవల్లా, ఉత్తర దక్షిణ ధృవాలు మార్పుచెందుతూ ఉండుట వల్లా ఈ పన్నెండు నెలలలో సూర్యుని తాపప్రకాశాలు ఒక్కటిగా ఉండకుండా కొంత కొంత భేదంగా ఉంటాయి. ఇట్టి ఉష్ణప్రకాశాలు కూడా ప్రాణి మనుగడకు అవసరమే. కనుక వీటిని ద్వాదశాదిత్యులుగా లెక్కించాము. విద్యుత్ మరియు యజ్ఞము (అగ్నిహోత్రము) కూడా దేవతలే. విద్యుత్ అంటే మేఘాలలో ఏర్పడే మెరుపులు. అగ్నిహోత్రం వల్ల జల వాయువులు, భూమి శుద్ధమౌతాయి. ప్రాణులన్నిటికి మేలు జరుగుతుంది. కనుక అదియును దేవతయే". అని వివరించారు.

ఇక మనం మెరుపు దేవత ఎలా అవుతుందో ఆలోచిద్దాము. ఆకాశంలో మేఘాల రాపిడివల్ల -దగ్గరగా రావటంవల్ల ధన విద్యుత్‌తో కూడిన మేఘాలలోని విద్యుత్, ఋణ విద్యుత్ గల మేఘాల లోనికి గెంతుతుంది (Jump) చేస్తుంది. అది మనకు మెరుపుగా కనబడుతుంది. ఆ రాపిడిశబ్దం మనకు కొద్ది ఆలస్యంగా ఉరుముగా వినబడుతుంది. ఇంతేగాక, ఈ మెరుపులవల్ల ప్రతి సంవత్సరం వందలకొలది టన్నుల నత్రజని భూమికి చేరి భూమిని సారవంతం చేస్తుందంటున్నారు ఆధునిక వైజ్ఞానికులు. అందుకే కాబోలు క్షణికంగా ఉండే మెరుపులను కూడా దేవత అంటాయి మన వేదశాస్త్రాలు. ఇది 32వ దేవత. 33 వది యజ్ఞము.

మనం అగ్నిహోత్రంలో వేసే ఆవునెయ్యి, మూలికలు, ధాన్యాలు, పప్పులు, కాయలు మొదలైన ఆహుతులవల్ల అందుండి వెలువడే వాయువులు ప్రాణులకు పుష్టిని, ఆరోగ్యాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయి. వాయువులోని కాలుష్యాలను పోగొట్టి గాలిని శుద్ధిపరుస్తాయి. క్రమంగా మేఘాలలోనికి చేరి అందలి వాయురూపంలో ఉన్న నీటిని శుద్ధిచేస్తాయి. ఆ మేఘాలు వర్షించినపుడు భూమిని, దానిపై ఉండే నీటిని కాలుష్యరహితం (Purify) చేస్తాయి. తద్వారా ప్రాణులకు చాలా మేలు జరుగుతుంది. ఈ విషయాన్ని మన ఆదర్శ ఆప్తపురుషుడు శ్రీ కృష్ణుడు భగవద్గీత 3వ అధ్యాయంలో చక్కగా వివరించారు. వారి వివరణను వారి మాటలలోనే తెలుసుకుందాము రండు.

సహ యజ్ఞాః ప్రజాసృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోఽ స్త్విష్టకామధుక్ ॥

సృష్ట్యాదిలో పరమేశ్వరుడు మానవులతో బాటు యజ్ఞాలను సృజించి ఇట్లుపదేశించాడు – ఓ మానవులారా! ఈ యజ్ఞాల ద్వారా మీ మీ కోరికలను నెరవేర్చుకోండి. ఇవి మీ కోరికలను తీర్చే కామధేనువులు.

దేవా న్భావయతా ఽనేన తే దేవా భావయన్తు వః ।
పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ ॥

ఈ యజ్ఞాలతో దేవతలు భావన చేయబడతారు. అంటే, జడ దేవతలైన పృథివ్యాపస్తేజోవాయురాకాశాలు శుద్ధి చేయబడతాయి. ఆ విధంగా శుద్ధి చేయబడిన పంచభూతాలు మిమ్ము శుద్ధులుగా, ఆరోగ్యవంతులుగా, బలిష్ఠులుగా చేస్తాయి. ఈ విధంగా పరస్పరం భావన చేసుకుంటూ (శుద్ధిచేసుకుంటూ) ఉత్తమ శ్రేయస్సును పొందండి.

ఇష్టా న్భోగాన్హి వో దేవా దాస్యన్తే యజ్ఞ భావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥

యజ్ఞాలతో భావన చేయబడిన దేవతలు మీకు కావలసిన భోగాలను – ఆహారాది జీవన నిర్వహణ సుఖాలను ప్రసాదిస్తాయి. ఆ విధంగా వాటినుండి ఉపకారం పొంది మరల వాటికి ఆహుతుల నివ్వకపోతే వారు దొంగిలించిన వారే ఔతారు.

యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।
భుంజతే తే త్వఘం పాపా యే పచం త్యాత్మకారణాత్ ॥

యజ్ఞానంతరం మిగిలిన పదార్థాలను తినేవారు సర్వపాపల నుండి విముక్తులౌతారు. అట్లుకాక, ఎవరు కేవలం తమకొరకే అన్నాదులను వండుకొని తింటారో వారు పాపమును మాత్రమే భుజించిన వారౌతారు.

అన్నాద్ భవంతి భూతాని పర్జన్యా దన్నసంభవః ।
యజ్ఞాద్ భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః ॥

పరిశీలించి చూస్తే – అన్నంవల్లనే ప్రాణులు జీవిస్తున్నాయి. అన్నం మేఘాలు వర్షించటంవల్ల ఉత్పన్నమౌతున్నది. మేఘాలు యజ్ఞాలవల్ల ఏర్పడుతున్నాయి. యజ్ఞాలు కర్మవల్ల జరుగుతున్నాయి.

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవం ।
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥

యజ్ఞకర్మ వేదజ్ఞానం వల్ల తెలిసింది. వేదం నాశరహితమగు అక్షరమగు పరబ్రహ్మవల్ల ప్రకటింపబడింది. అట్టి సర్వజ్ఞానమయమైన వేదం నిత్యం యజ్ఞం చేయమంటున్నది.

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥

(భగవద్గీత. 3-10 నుండి 16)

పరమేశ్వరునిచే ఏర్పరచబడిన ఈ యజ్ఞచక్రమును ఎవరు అనుసరించరో వారు పాపులు, వ్యర్థముగా జీవించువారౌతారు.

పై వాక్యాలు 5,110 సంవత్సరాల పూర్వం యోగేశ్వర శ్రీకృష్ణునివి కాగా నేటి వైజ్ఞానికులు మరికొన్ని ఆశ్చర్యకమైన విషయాలు వెలుగులోనికి తెచ్చారు. జర్మనీ, ఫ్రాన్స్, చిలీ, పోలెండు దేశాలలో అగ్నిహోత్ర ఫామ్స్ (వ్యవసాయక్షేత్రాలు) నిర్మించి,

ఏవిధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండానే ఎక్కువ దిగుబడిని సాధించారు. ఏ బయోజెనిటిక్స్ లేకుండానే (హైబ్రీడ్ పద్ధతులు లేకుండానే) పెద్దపెద్ద పండ్లు, కూరగాయలు పండించారు. ఆశ్చర్యంగా 20 సె.మీ. పొడవు, 3.75 కి.గ్రా. బరువుగల బీట్రూట్ దుంపలు కూడా పండినవి.

ఇప్పుడు ఈ పరిశోధనలు 'మానవుల, జంతువుల ఆరోగ్యంపై అగ్నిహోత్ర ప్రభావం' అనే విషయంవైపు మరలాయి. మంచి ఫలితాలే వస్తున్నట్లు చెబుతున్నారు. ఏయే వ్యాధులకు ఏయే మూలికలు మిక్కిలి ప్రయోజనకరంగా ఉంటాయో పరిశోధించవలసి ఉంది. అందుచేత అగ్నిహోత్రం ఒక దేవతగా పరిగణిస్తాయి మన వేదశాస్త్రాలు. కనుక విద్యుత్, యజ్ఞములతో కలిసి జడదేవతలు 33 అయ్యాయి.

<u>యజ్ఞము(అగ్నిహోత్రం) ప్రజాపతి - విద్యుత్(మెరుపు) ఇంద్రుడు</u>

అగ్నిహోత్రాన్ని 'ప్రజాపతి' దేవతగా పేర్కొన్నారు మన ఋషులు. ఏలనంటే - అగ్నిహోత్ర వాయువులు విస్తరిస్తూ పక్షపాతంలేకుండా ప్రాణులన్నిటికి మేలుచేస్తాయి. దీనిలో వేసిన నెయ్యి వాయువుగా మారి ప్రాణులకు పుష్టిని కలిగిస్తుంది. వాయువులోని దోషాలను, విషాలను పోగొడుతుంది. తద్వారా ప్రాణవాయువుతో బ్రతికే ప్రాణులన్నిటిని పాలిస్తుంది, రక్షిస్తుంది. కనుక అది ప్రజాపతి. ప్రాణిగణములకు పతి. పాలన పోషణలు చేసే ప్రాణపతి. కనుకనే మేము అగ్నిహోత్రాన్ని 'అగ్నిహోత్ర గణపతి' అంటున్నాము. ఈ అగ్నిహోత్రంలో వేసే మూలికలు, కాయధాన్యాలు, పప్పుధాన్యాలు, ఎండిన ద్రాక్ష, ఖర్జూరం, కొబ్బరి, బాదం మొదలైన చర్నీ, స్థాలీ పాకాదులు కూడా ప్రాణిగణములకు మేలు చేసేవే. అవి వాతావరణ దోషాలను పోగొట్టి ఋతువుల క్రమాన్ని సరిచేస్తాయి. వాటిలో హెచ్చుతగ్గులు కలుగకుండా కాపాడుతూ ప్రాణులను పాలిస్తాయి. ఈ విషయాలను వివరంగా తెలుసుకోగోరువారు నా రచనలు అగ్నిహోత్రం 100% వైజ్ఞానికం, అగ్నిహోత్ర రాసాయనిక విశ్లేషణ (Chemical Analysis of Agnihotra) చదువగోరుచున్నాను.

ఇక విద్యుత్(మెరుపు) ఇంద్రుడు ఎలా అవుతుందో తెలుసుకుందాము. విద్యుత్ అనే పదము మన వేదశాస్త్రాలలో అక్కడక్కడ కనబడుతుంది. అక్కడ దీని అర్థం మనం ఇప్పుడు వాడుకునే కరెంటు - ప్రవాహ విద్యుత్కాదు. మెరుపులను పేర్కొనటానికే విద్యుత్ పదమును ప్రయోగించారు. దీనిని 33వ దేవతగా లెక్కించారు. దీనిని 'ఇంద్ర' పదముతోనే పేర్కొనటం జరిగింది. ఇక్కడ మనం మరొక్క విషయం గుర్తించాలి. వేద పదములన్నీ యౌగికములు. అంటే - ధాత్వర్థాన్ని (Root Meaning ను) బట్టి మాత్రమే అర్థం చేసుకోవాలి. 'ఇంద్ర' పదము "ఇది - పరమైశ్వర్యే" అనే ధాతువుతో నిర్మించబడుతుంది. అంటే "గొప్ప ఐశ్వర్యం గలవాడు" అని అర్థం.

ఆధ్యాత్మికార్థంలో ఇంద్ర పదము పరమాత్మకు, జీవాత్మకు కూడా అన్వయిస్తుంది. సృష్టిలోని సమస్త ఐశ్వర్యాలను సృజించినది, ధరించి పాలించుచున్నది దేవుడే కనుక దేవుడు ఇంద్రుడు. ఆ దేవుడు జీవుని కొరకు ఇంద్రియాలను నిర్మించి వాటికి స్వామిని(యజమానుని) చేశాడు కనుక జీవుణ్ణికూడా ఇంద్రుడనవచ్చు. జీవుడు ఇంద్రియాలు అనే ఐశ్వర్యం గలవాడు. ఐశ్వర్యం అంటే కేవలం కరెన్సీయే కాదు. చాలా విలువైనవని అర్థం. దేవుని దయవల్ల మనకు ఇంద్రియాలన్నీ బాగున్నాయి. కనుక వాటి విలువ మనకు తెలియటంలేదు. వాటిలో ఏవైనా లేనివారికి, లేదా ఏకారణంచేతనైన అవి చెడిపోయినవారికి తెలుస్తుంది వాటి విలువ. వ్యాధివల్ల ఏదైనా ఇంద్రియానికి ఆపరేషన్ చేయవలసివస్తే లక్షలు ఖర్చుపెట్టడానికి సిద్ధం అవుతాముకదా! 'ఇంద్ర' పదము ఆధిభౌతికార్థంలో (ప్రాణులపరమైన అర్థంలో) ఐశ్వర్య సంపన్నులైన రాజులకు, కోటీశ్వరులకు, ప్రపంచ కుబేరులుగా గణించేవారికి ఇది వర్తిస్తుంది. నేడు రాచరికవ్యవస్థ లేదు కనుక ప్రభుత్వాన్ని ఇంద్రుడనవచ్చు. ఆధిదైవికార్థంలో (జడదేవతల పరంగా) ఇది విద్యుత్కు వర్తిస్తుంది. నేడు విద్యుత్వల్ల కలిగే లాభాలేమిటో చూస్తున్నారు కదా! విద్యుత్ ఐశ్వర్య ప్రదాయిని; తాను ప్రకాశిస్తూ మనను ప్రకాశింపచేస్తుంది. అయితే మేఘాలలో ఏర్పడే మెరుపును ఇంద్రుడని ఎందుకన్నారో తెలియవలసి ఉంది.

మెరుపులవల్ల ఎంతో నత్రజని భూమికి చేరుతుందని మనం పూర్వ పుటలలో తెలిసికున్నాము. ఇంతేగాక, వేదం మెరుపులవల్లనే మేఘాలు వర్షిస్తున్నా యంటుంది. ఆ వర్షాలు ప్రాణులకు అన్నం పెడుతున్నాయి, సంపదలనిస్తున్నాయి కనుక మెరుపులను ఇంద్రుడంటుంది వేదం. యాస్క మహర్షి తమ నిఘంటు శాస్త్రంలో ఇంద్రపదమునకు

13 నిర్వచనాలు చెప్పారు. వాటిని అక్కడ చూడండి. అందులో విద్యుత్ – మెరుపు ఒకటి.

మెరుపులను గురించి ఆధునిక విజ్ఞానవేత్తలు మరొక విషయం చెబుతున్నారు. మెరుపులలో చాలా విద్యుత్ ఉంటుందట. ఆ విద్యుత్‌ను సేకరించి నిలువ చేసుకోగలిగితే విద్యుత్ సమస్యలన్నీ తొలగిపోయి, పుష్కలంగా విద్యుత్ మిగిలి పోతుందట. ఆ విద్యుత్‌ను వాహనాలకు, పరిశ్రమలకు వ్యవసాయానికి వాడుకుంటే దేశం ఎంతగానో ఐశ్వర్యవంతమౌతుందట. అయితే, ఆ టెక్నాలజీ ఇంకా రాలేదు. కనిపెట్టవలసి ఉంది.

యజ్ఞ విద్యుత్తులు దేవతలు కనుకనే నిత్యాగ్నిహోత్రంలో "ఓం ప్రజాపతయే స్వాహా, ఓం ఇంద్రాయ స్వాహా" అంటూ ప్రత్యేకంగా ఈ రెండు దేవతలకు ఆవునేతితో ఆహుతులిస్తారు. వీటిలో ప్రజాపతి దేవతయైన యజ్ఞాన్నే – అగ్నిహోత్రాన్నే మేము గణపతి – అగ్నిహోత్ర గణపతి అంటున్నాము. అయితే, నేడు లోక ప్రచలితమైయున్న పౌరాణిక గణపతి సంగతేమిటి? అట్టి ఆకారంగల గణపతి ఉంటాడా? అతని జన్మవృత్తాంతమేమి? గాణాపత్య సంప్రదాయమేమిటి? అనే ప్రశ్నలు చాలానే మన ముందున్నాయి. వాటిని గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాము.

<u>పురాణాలలో గణపతి</u>

అష్టాదశ (18) పురాణాలలోను సుమారు 10 పురాణాలలో గణపతి జన్మకథ లున్నాయి. విచిత్రమేమంటే 10 పురాణాలలోను 10 రకాలుగా ఉన్నాయి. వీటిలో మత్స్యపురాణంలోని కథయే–పార్వతి నలుగుపిండినుండి పుట్టిన కథయే లోక ప్రసిద్ధమయ్యింది. దీనితో శివపురాణంలోని కథ జోడించి నేడు వినాయక వ్రతకల్పంలో వ్రాయబడింది. బ్రహ్మవైవర్తపురాణం ప్రకారం – పార్వతి పుత్రప్రాప్తికొరకు గంగానది ఒడ్డున సనత్కుమారుని పౌరోహిత్యంలో పుణ్యాకరత వ్రతాన్ని చేస్తూ ఒక సంవత్సరం వరకు విష్ణువును ఆరాధించగా ఆమెకు ఒక పుత్రుడు కలిగాడట. ఆ నవజాత శిశువును చూడటానికి సమస్త దేవతలు వచ్చారు. వారిలో శని దేవత కూడా ఉన్నాడు. అతడు భార్యాశాపగ్రస్తుడట. శనియొక్క చూపు పడగానే గణపతి తల తెగిపడిపోయినదట. అప్పుడు విష్ణువు పుష్పక భద్రనది

ఒడ్డున నిద్రించుచున్న ఒక ఏనుగు తల నరికి ఆ శిశువునకు అమర్చెనట. మరి, మత్స్య శివ పురాణాలలోని లోక ప్రచలిత జన్మవృత్తాంతం సత్యమా? బ్రహ్మవైవర్త పురాణాలలోని ఈ కథ సత్యమా? (శని దేవుని కథ ఏమంటే – శని యొక్క భార్య చాలా కాలం విష్ణువును ఆరాధించినా విష్ణువు అనుగ్రహించలేదట. దానితో ఆమెకు విపరీతమైన కోపమొచ్చి విష్ణువును ఏమీ చేయలేక తన భర్తనే శపించినదట. "నీ చూపు ఎవరి మీద పడితే వారికి కీడు కలుగునుగాక" అని భర్తను శపించింది. అత్త మీద కోపం దుత్తమీద – కుండమీద చూపించినట్లు). ఇట్టి వింత విడ్డూర కథలు పురాణాలలో కోకొల్లలుగా ఉన్నాయి. ఇవన్నీ వ్యాసమహర్షి ఒక్కరే వ్రాశారంటే ఎలా నమ్మాలి? ఆలోచించండి.

గణపతి జన్మవృత్తాంతాలు వేరువేరుగా ఉన్నట్లే అతని స్తుతులును విచిత్రంగా ఉన్నాయి. "శ్రీగాణపత్య అథర్వణ శీర్షము" అనే గ్రంథంలో గణపతి స్తుతి ఈ విధంగా ఉంది–

> **ఓం నమస్తే గణపతయే – త్వమేవ ప్రత్యక్షం**
> **తత్వమసి త్వమేవ కేవలం కర్తాసి, త్వమేవ కేవలం**
> **బ్రహ్మాసి, త్వం బ్రహ్మాత్వం విష్ణుస్త్వం రుద్రస్త్వమింద్రస్త్వ**
> **మగ్నిస్త్వం వాయుస్త్వం సూర్యస్త్వం చంద్రమాస్త్వం**
> **బ్రహ్మ భూర్భువః స్వరోమ్॥**

దీనర్థం మనకు తెలికగానే అర్థమౌతున్నది. సృష్టి స్థితి లయ కర్త గణపతియే అనియు; అతనికే విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, బ్రహ్మ, భూః, భువః, స్వః, ఓమ్ అను అనేక నామములున్నాయంటూ వేదప్రతిపాదిత పరమేశ్వరుని వర్ణనకు సరిపోతున్నది. ఆ గ్రంథంలోనే దీనికి భిన్నంగా మరొకచోట ఒక వింత వికార మానవాకారంగా వర్ణింపబడింది చూడండి–

ఏక దంతాయ విద్మహే, వక్రతుండాయ ధీమహి, తన్నోదంతీ ప్రచోదయాత్॥

అంటూ ఒక కల్పిత గాయత్రీ మంత్రంగా కీర్తిస్తూ – **ఏక దంత చతుర్హస్తం పాశమంకుశ ధారిణమ్ దదంచ వరదం హస్తైర్బిభ్రాణం మూషక ధ్వజమ్. రక్తం లంబోదరం శూర్పకర్ణకం రక్తావససమ్ రక్తగంధానులిప్తారం – రక్త పుష్పైః సుపూజితమ్........**

నమో వ్రతపతయే, నమో గణపతయే నమః ప్రమద పతయే నమస్తే అస్తు లంబోదరా యైక దంతాయ విఘ్ననాశినే శివసుతాయ శ్రీవరద మూర్తయే నమః॥

అని కీర్తిస్తూ మనం నేడు లోకంలో చూచే వినాయక విగ్రహాకారంగా ఏక దంతము, వంకరముఖము, నాలుగు చేతులు, పెద్ద కడుపు, పెద్ద చెవులు, ఎర్రని వస్త్రాలు, ఎర్రచందన లేపనము గలిగి ఎర్రని పూలతో పూజింపబడే వానిగా వర్ణింపబడింది. వీటిని పరిశీలించి చూస్తే ఇది అగ్నిహోత్రానికి ప్రతీకగా కల్పించబడిన ఒక శిల్పి చమత్కారం. ఇక మనం ముందుగా ప్రతీక అంటే ఏమర్థమో తెలుసుకొని అగ్నిహోత్ర గణపతిని గురించి ఆలోచిద్దాము.

<u>ప్రతీకలు - ప్రత్యాయనీయాలు</u>

ప్రతీకలు - ప్రత్యాయనీయాలు అనే రెండు పదములు పారిభాషక పదములు. ప్రతీక అంటే 'అంశము' అని సామాన్యార్థం. కాని, శాస్త్రాలలో ప్రకరణాన్నిబట్టి ప్రతీక పదానికి చిహ్నము, గుర్తు, ఉపమానము అనే అర్థాలు వస్తాయి. కవులు, కళాకారులు తమ తమ భావాలను కవితలద్వారా, చిత్రాలద్వారా తెలియపరుస్తారు (నాట్యకారులు తమ హస్తాలద్వారా, వ్రేళ్ళద్వారా సూచించి నట్లు). వారి కాల్పనిక భావాల వెనుక ఒక దివ్యమైన సందేశముంటుంది. పరమకవియైన సృష్టికర్త కూడా తన అమరకావ్యమైన వేదాలలో ప్రతీకల ద్వారానే - ఉపమానాల ద్వారానే మానవులకు తన సందేశాలను తెలిపాడు.

ఉదాహరణకు -

<u>1. "స్వస్తి పంథా మనుచరేమ సూర్యాచంద్రమసావివ"</u>

ఋగ్వేదం (5-51-15)

సూర్య చంద్రులవలె మీరు స్వస్తిమార్గాన సామాజిక జీవనం గడపండి.


<u>2. "అన్యో౽ న్య మభి హర్యత, వత్సం జాతమివాఘ్న్యా"</u>

అథర్వవేదం (3-30-1)

నవజాత వత్సమును(దూడను) గోమాత ప్రేమించునట్లు సామాజిక జీవనంలో మీరు ఒండొరులను ప్రేమించుకోండి. ఆదరించుకోండి.

ఇచట సూర్యచంద్రులు, గోవత్సములు ప్రతీకలుగా ఉన్నాయి. ఆ ప్రతీకలలోని సందేశాన్ని గ్రహించి మనం ఆ రకంగా సామాజిక జీవనం గడపటాన్నే ప్రత్యాయనీయమంటారు. అట్లే లోకంలో మనకు కనబడే న్యాయాలయాలలోని సున్నితపుత్రాసు ఒక ప్రతీక. అది అక్కడ సరియైన న్యాయం జరుగుతుందని సూచిస్తుంది. అది ఆ ప్రతీకకు ప్రత్యాయనీయం. అట్లే, మన త్రివర్ణ జాతీయ పతాకం, కమ్యూనిస్టుల జండాపైన సుత్తికొడవలి ప్రతీకలు. ఇవి మనకు 'త్యాగం, శాంతి, సౌభాగ్యాలు', 'కార్మిక కర్షక సంక్షేమాలు' అనే ప్రత్యాయనీయాలను గుర్తుచేస్తున్నాయి. ప్రతీకలు మనకు కనబడతాయి, ప్రత్యాయనీయాలు కనబడవు. మనం వాటిని బుద్ధితో ఆలోచించి గ్రహించాలి. యాజ్ఞవల్క్య మహర్షి తన శతపథ బ్రాహ్మణంలో అగ్నిహోత్రాన్ని ఒక ప్రతీకగా తీసుకొని దానివలె మీరు నిజ జీవితాన్ని గడపమంటాడు. అగ్నిహోత్రం మనకు తనవలె పక్షపాతరహితంగా ప్రాణులన్నిటికి మేలుచేసే కార్యాలు చెయ్యమంటుంది. యజ్ఞమయ జీవితం గడుపమంటుంది. అట్లే అగ్ని ప్రతీక - శ్రద్ధ ప్రత్యాయనీయం; ఆజ్యం (నెయ్యి) ప్రతీక - సత్యం ప్రత్యాయనీయం అంటాడు. ఈ విధంగానే ఘృతం, సమిధలు, ఆహుతులు, యజ్ఞవేది మొదలైనవన్నీ ప్రతీకలుగా ఉండి మనకు మౌనంగా సందేశాలను - ప్రత్యాయనీయాల నిస్తున్నాయంటాడు యాజ్ఞవల్క్యమహర్షి. ఈ విషయం చాలా పెద్దది. వివరంగా తెలుసుకోగోరువారు నా రచన "అగ్నిహోత్ర ఆధ్యాత్మిక స్వరూపం" చదవండి. అట్టి మహిమాన్విత అగ్నిహోత్రానికి గణపతి విగ్రహం ప్రతీక. ఇది ఒక సూక్ష్మ విషయం. జాగ్రత్తగా చదివి అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యండి.

<u>గణపతివిగ్రహం ప్రతీక</u> - <u>అగ్నిహోత్రం ప్రత్యాయనీయం</u>





మనం పూర్వ 7వ పుటలో తెలుసుకొన్న ఋగ్వేద గణపతిమంత్రానికి దేవత బ్రహ్మణస్పతి. దానికి మనం అక్కడ బ్రహ్మాండాధిపతి అని చెప్పుకున్నాము.

దీనికి యజ్ఞము యొక్క స్వామి, ధనము యొక్క స్వామి అనే మరి రెండు అర్థాలు కూడా చెప్పబడ్డాయి. అందుచే ఆ మంత్రం యజ్ఞ మహిమనుకూడా బోధిస్తున్నదన్న మాట. వాస్తవంగా అగ్ని అంటే యజ్ఞమే. 'అగ్నిరేవ యజ్ఞంః' అంటుంది శతపథ బ్రాహ్మణం (3-2-2-1). ఇంతేగాక, "ఏష వై ప్రత్యక్షం యజ్ఞో యత్ ప్రజాపతిః" (4-3-4-3). ఈ యజ్ఞాన్నే ప్రజాపతి అని కూడా అంటారంటుంది. మనం పూర్వ పుటలలో చెప్పుకున్నట్లుగా అగ్నిహోత్రం వాతావరణాన్ని శుద్ధిచేసి, మేఘాలను ఆకర్షించి వర్షింపజేసి ప్రజలను, ప్రాణులను పాలిస్తుంది, పోషిస్తుంది. కనుక అదియును ప్రజాపతియే. "అగ్నిర్వై ధూమ్రో జాయతే, ధూమ్రా దభ్రమాద్ వృష్టిం" అంటుంది శతపథ బ్రాహ్మణం (4వ అధ్యాయం).

ఆలోచించి చూస్తే పౌరాణిక గణపతియొక్క వివిధ నామాలు, విశేషణాలు అగ్నిహోత్ర ఫలితాలనే సూచిస్తున్నాయి. ఎవరో కళాకారుడు అగ్నిహోత్రంవల్ల కలిగే లాభాలను తెలుపుటకు ఒక చిత్రంగా (కార్టూన్‌గా) గణపతి ఆకారాన్ని కల్పనచేసి చిత్రించాడేమో ననిపిస్తుంది. దానిని ఒక శిల్పకారుడు ఒక విగ్రహంగా రూపొందించి ఉంటాడు. విగ్రహ ఆకారం యజ్ఞకుండాన్ని పోలి ఉంటుంది. పౌరాణిక స్తుతిలో గణపతి రక్తవర్ణుడని, రక్తవర్ణవస్త్రధారి యనీ చెప్పబడింది. అగ్ని ఎఱ్ఱనిరంగు కలిగి రక్తంవలె ఉంటుందికదా! మరి యొక పేరు లంబోదరుడు అంటే పెద్ద కడుపు కలవాడని అర్థం. పృథివ్యాది పంచభూతాలలోను, మిగతా దేవతలలోను అగ్నికే పెద్ద కడుపు ఉంది. నెయ్యి మొదలైన ఎంత హవ్యద్రవ్యం వేసినా తిని - భస్మంచేసి జీర్ణంచేసుకొను శక్తి దానికుంది. మిగతా ప్రాకృతిక దేవతలకు ఆ శక్తి లేదు. అందుచే అగ్నిహోత్రం లంబోదరుడు. పూర్వం చెప్పుకొన్నట్లుగా కేవలం అది తినటమేగాక వాయువు ద్వారా మిగిలిన దేవతలన్నిటికి అందచేస్తుంది. అందుకనే వాయువును "హవ్యవాహన!" అని కావ్యాలలో సంబోధింపబడింది.

గణపతిని వక్రతుండుడు అంటారు. అగ్ని శిఖలు వంకర టింకరగా ఉంటాయి కదా! ఇక ధూమకేతు సంబోధనను గురించి ఆలోచిద్దాము. ధూమము అంటే పొగ. ధూమకేతువు అంటే పొగను జండాగా కలవాడని అర్థం వస్తుంది. దూరం నుండి ఒక కార్యాలయాన్ని దానిపైన ఎగురుతున్న జండాను బట్టి అది ఏ ప్రభుత్వ కార్యాలయమో గుర్తిస్తాము. అట్లే, ఎక్కడైనా దూరంగా పొగ కనబడితే అక్కడ

అగ్నిఉన్నట్లు, ఏదో కాలుతున్నదని గుర్తిస్తాము. కనుక **ధూమకేతు** నామముకూడా అగ్నిహోత్రానికే అన్వయిస్తుంది. అగ్నికాక మరెవరు ధూమాన్ని కేతువుగా - జండాగా కలిగి ఉంటారు? అగ్ని ద్విమాతృడని కొన్ని పురాణాలలో వ్రాయబడింది. పూర్వం అగ్నిహోత్రంలో అగ్నిని వెలిగించటానికి రెండు అరణులను రాపిడిచేసి అగ్నిని రగిలించేవారు. రెండు అరణు లనే తల్లినుండి అగ్నిహోత్ర గణపతి పుట్టాడన్నమాట.

ఋగ్వేదం (1-31-2) లో "త్వమగ్నే అంగిరసతమః........ ద్విమాతా శయుః కతిధా చిదాయవే॥" - అంటూ పృథివీ అంతరిక్షాలు అగ్నికి తల్లులంటుంది. కనుక అగ్నిహోత్ర గణపతి ద్విమాతురుడు.

గణపతికి మూషిక వాహనుడని మరియొక పేరు. తైత్తరీయ సంహిత (1-1-3-3) లో "పృథివి సూర్యుని నుండి వేరైనపుడు దానిపైన అగ్ని ఉండేది. కాలక్రమంలో ఆ అగ్ని మూషకమువలె (ఎలుకవలె) పృథివిలోనికి వెళ్ళిపోయింది" అని చెప్పబడింది. మరొకచోట గణపతిని మయూర వాహనుడని కీర్తించారు. మహర్షిదయానందుల వారు అగ్ని పదమునకు ఆధిదైవికార్థం వ్రాస్తూ అగ్నివిద్య, అశ్వవిద్య, నౌకా విమానాది యానవిద్య అని గ్రహించాలన్నారు. అందువల్ల మూషకం పృథివిపై నడిచేదానికి సంకేతంగాను, మయూరం పృథివిపై మరియు ఆకాశంలో విహరించటానికి సంకేతంగాను తీసుకోవాలని విద్వాంసులు వ్యాఖ్యానించారు. గణపతి మహాదేవుని కొడుకంటారు. అథర్వవేదం (18-4-4)లో సూర్యుని మహాదేవుడని చెప్పబడింది. సూర్యుని నుండే అగ్నిపుట్టింది కదా! గణపతిని వినాయకుడంటారు. వినాయకుడంటే విశేషనాయకుడని అర్థం. కారక సంహిత "అగ్నిర్వై దేవానాం సేనాని" అంటుంది. ఈ విధంగా ఆలోచిస్తే గణపతి విశేషణాలన్నీ అగ్నిహోత్ర గణపతికి వర్తిస్తాయి.

అక్కడక్కడ పంచముఖి గణేశుని వర్ణన ఉంది. యజ్ఞ పదము కేవలం అగ్నిహోత్రానికే సీమితంకాదు. బ్రహ్మయజ్ఞం(సంధ్యావందనం), దేవయజ్ఞం (అగ్నిహోత్రం), పితృయజ్ఞం(జీవిత మాతా పితరులకు, ఆశ్రిత బంధుమిత్రులకు సేవ చెయ్యటం), అతిథియజ్ఞం(విద్వాంసులైన సంన్యాసులను, మహాత్ములను సేవించటం) బలివైశ్వదేవయజ్ఞం(ఆశ్రిత గో అశ్వాది పశువులను, పనివారిని తగిన భోజన పానీయాదులతో తృప్తిపరచటం) - ఈ అయిదింటిని పంచ

మహాయజ్ఞాలంటాయి వేదశాస్త్రాలు. పంచముఖి గణపతిని పూజించటం, సేవించటం అంటే - శ్రద్ధా భక్తులతో ఈ పంచ మహాయజ్ఞాలు నిత్యం చెయ్యటం. ముఖ్యంగా గృహస్థులు వీటిని ఆచరించాలి.

నేడు అగ్నిహోత్రం సంకుచితమై దీపారాధన అయ్యింది. ప్రతీకలు దేవుళ్ళయ్యాయి.

సృష్ట్యాదినుండి మహాభారతకాలం వరకు మన దేశంలో అగ్నిహోత్రానికి గొప్ప మాన్యత ఉండేది. గృహస్థులు నిత్యం పంచమహా యజ్ఞాలు చెయ్యటమేకాక పౌర్ణమి అమావాస్యలకు, పండుగలకు విశేషహోమాలు చేసేవారు. ప్రతీ శుభకార్యాన్ని అగ్నిహోత్రంతో ఆరంభించేవారు. క్రొత్త పంటలు ఇంటికి వస్తే విశేషంగా "నవసస్యేష్టి" మంత్రాలతో వాటిని కొంత అగ్నిహోత్రంలో ఆహుతులుగా యిచ్చి అనంతరమే వారు భుజించేవారు. గర్భాధాన పుంసవన సీమంతోన్నయన జాతకర్మ నామకరణాది 16 సంస్కారాలను అగ్నిహోత్రపూర్వకంగానే జరుపుకునేవారు. ప్రపంచయుద్ధంలాటి మహాభారతయుద్ధంవల్ల చాలా చాలా నష్టమే అయ్యింది. సిరిసంపదలేకాక సంస్కృతి, సభ్యతలు సన్నగిల్లాయి. ధర్మాధర్మాలను, కర్తవ్యాకర్తవ్యాలను తెలిపే సంన్యాసులు, మహాత్ములు కరువయ్యారు. దానితో వేదవిరుద్ధ సంప్రదాయాలు పుట్టుకొచ్చాయి.

శ్రేష్ఠతమ సత్కర్మగా కీర్తింపబడిన అగ్నిహోత్ర కార్యంలో అపశ్రుతులు చోటు చేసుకున్నాయి. అధ్వరమైన(హింస ఏమాత్రంలేని) అగ్నిహోత్రం హింసా భరితమయ్యింది. వేదమంత్రాలకు విపరీతార్థాలు వ్రాసి మేకలను, ఆవులను, అశ్వాలను యూపస్తంభాలకు కట్టి వేదమంత్రాలు చదువుతూనే ఆ జంతువులను చిత్రహింసలకు గురిచేసి చంపి, వాటి మాంసంతో ఆహుతులిచ్చారు. సోమపానం పేరుతో సురాపానం చేశారు. క్రమంగా వామమార్గం బలపడిపోయి ప్రజలు మద్యమాంసాహారు లయ్యారు. వ్యభిచరించేవారు. ఆ వికార విలాస జీవితాలకు విరుద్ధంగానే బౌద్ధ జైన మతాలు పుట్టుకొచ్చాయి. వివేకం జాగృతమయ్యింది. ప్రజలంతా మహాత్ములైన బుద్ధునికి, జినమునికి అనుయాయులయ్యారు. దానితో అగ్నిహోత్రం సంకుచితమై దీపారాధనగా మిగిలిపోయింది. సృష్టికర్త యిచ్చిన సత్యవేదజ్ఞానం, దర్శన ఉపనిషదాదుల తార్కిక జ్ఞానం కనుమరుగై శైవ వైష్ణవాది సంప్రదాయాలు చాలానే పుట్టుకొచ్చాయి. వాటిలో గాణాపత్య సంప్రదాయం ఒకటి.

గాణాపత్య సంప్రదాయం

గాణాపత్యము లేదా గాణపత్యము అనబడే ఈ సంప్రదాయం 5 నుండి 8 శతాబ్దాల మధ్యకాలంలో ప్రచలితమైయుండేది. శైవులు శివలింగాన్ని, వైష్ణవులు చతుర్భుజ విష్ణుమూర్తిని, శాక్తేయులు మహంకాళిని కల్పనచేసి పూజించినట్లే ఈ గాణపత్యులు గణపతి విగ్రహాన్ని కల్పన చేసి పూజించేవారు. ఈ సంప్రదాయం మన దేశంలోనేకాక విదేశాలకును ప్రాకింది. చైనాలోని కుంగ్‌శియాంగ్‌లో క్రీ.శ. 531 సంవత్సరంనాటి గణేశ విగ్రహం లభించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో 6వ శతాబ్దంనాటి పాలరాతి గణేశుని విగ్రహం ఉంది. సుమారు 40 సంవత్సరాల క్రిందట లావోస్ ప్రభుత్వం గణేశుని చిత్రంతో తపాల బిల్లలు విడుదల చేసింది. న్యూయార్క్, టొరొంటో మరియు జర్మనీలో గణపతి ప్రాచీన మందిరాలున్నాయి. నేపాల్, టిబెట్, జపాన్, ఇండో చైనా, స్యామ్, బర్మా, మలయా, జావా, బోర్నియా, సుమిత్రా మొదలైన కొన్ని దేశాలలో గణపతి ప్రతిమలు దొరికాయట.

గణపతి విగ్రహం అగ్నిహోత్రానికి ప్రతీక అయినట్లే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దేవీ విగ్రహాలును ప్రతీకలే. వాటి వెనుక కూడా బుద్ధితో ఆలోచించి గ్రహించవలసిన ప్రత్యాయనీయాలున్నాయి. వాటిని గురించి మరియొక పుస్తకంలో తెలుసుకుందాము. ప్రత్యాయనీయాలు లుప్తమైపోయి ప్రతీకలు మిగిలాయి. వాటిని కొందరు స్వార్థపరులు దేవుళ్ళను చేశారు. ఆ ప్రతీకల పేరుతో పురాణాలు వ్రాసి వాటిని తాము వ్రాసేరంటే ప్రజలు నమ్మరని పురాణాలన్నీ వేదవ్యాస మహర్షులే వ్రాశారని ప్రచారం చేశారు. అమాయక ప్రజలు వాటిని నమ్మటం మొదలుపెట్టారు. దీనిని ఆసరాగా తీసుకొని పురాణాలకు తగినట్లు విగ్రహాలను నిర్మించి, గుళ్ళూ గోపురాలు కట్టారు. వ్రతకల్పాలు వ్రాసి షోడశోపచార పూజలు చేయించారు. సుప్రభాతాలు వ్రాశారు. వేదాంత దర్శనంవంటి గొప్ప తార్కిక గ్రంథం వ్రాసిన వేదవ్యాస మహర్షుల వారు ఈ పుక్కిటి పురాణాలు వ్రాశారంటే విడ్డూరంగానే ఉంది.

ఇంతటితో ఆగిపోకుండా పురాణాలకు ఉపపురాణాలు సృష్టించారు. క్షేత్ర మహాత్మ్యాలు వ్రాసి ఆ యా క్షేత్రాలకు భక్తుల నాకర్షించి దక్షిణలు దండుకున్నారు. వాటిని చిలువలు పలువలుచేసి క్రొత్త క్రొత్త దేవీ దేవతలను సృష్టించారు. గణపతి కూతురు సంతోషిమాత అన్నారు. హరి హరుల కలయికతో అయ్యప్ప స్వామి

పుట్టాదన్నారు. నారాయణునికన్న సత్యనారాయణుడు తేలికగా ప్రసన్నమై వరాలవర్షం కురిపిస్తాడన్నారు. ఆ యా క్రొత్త దేవీ దేవతలకు వ్రతకల్పాలు, అష్టోత్తర శతనామాలు సుప్రభాతాలు తయారుచేశారు. ఆ క్రమంలోనే అగ్నిహోత్ర ప్రతీకయైన గణపతి మూర్తికి వివిధ రూపాలు కల్పించి పూజిస్తున్నారు. అట్టహాసంగా నవరాత్రులు చేసి సామూహిక నిమజ్జన కార్యక్రమాలు చేస్తున్నారు.

గణపతి నిమజ్జనం ఒక ప్రహసనం

వేదాల వెలుగులో మన ప్రాచీన ఋషులు సృష్టిక్రమాన్ని దర్శన ఉపనిషదాదులలో చాలా చక్కగా వివరించి చెప్పారు. ఆ ప్రకారం ఈ సృష్టి మూలప్రకృతి నుండి క్రమ పరిణామం చెందుతూ ముందు మహత్తత్వ, అహంకార పంచతన్మాత్రాలు వరుసగా పుట్టాయి. అనంతరం పంచ తన్మాత్రలనుండే పంచభూతాలు పుట్టాయి. అవి ఏ క్రమంలో పుట్టాయంటే - **"తస్మాద్ వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః, ఆకాశాద్ వాయుః. వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యో అన్నమ్, అన్నాద్ రేతః, రేతసః పురుషః, స వా ఏష పురుషో అన్నరసమయః॥"**

- తైత్తరీయ ఉపనిషత్ బ్రహ్మా నందవల్లిలో ఒకటవ అనువాకం.

పంచతన్మాత్రలనుండి ముందుగా ఆకాశభూతం ఏర్పడింది. అనంతరం వాయువు, తదుపరి అగ్ని, అనంతరం జలం, తదుపరి భూమి, వృక్ష జాతులు, ఆహారం, ప్రాణులు పుట్టాయి అంటే ఏర్పడ్డాయన్నమాట.

పూర్వం మా చిన్నతనం వరకు కూడా పూజగణపతులను మట్టితోటే చేసేవారు. పూజ అనంతరం వాటిని కాలువలలోనో, చెరువులలోనో ఎవరి అనుకూలం ప్రకారం వారు మరునాడు లేదా 2,3 రోజుల తరువాత నిమజ్జనం చేసేవారు. దానికి ఏ అట్టహాసం ఉండేదికాదు. పై ఋషివాక్యాలలో జలం నుండి పృథివి ఏర్పడిందని చెప్పబడింది. మట్టికి తల్లి నీళ్ళు అన్న భావంతో కావచ్చు ఆ విధంగా చేసేవారు. లేదా పొలాలలో వేస్తే కాలితో త్రొక్కుతారేమో నని నీటిలో వేసే ప్రథ ఏర్పడి ఉండవచ్చు. కాని, నేడు గణపతులను ప్లాస్టర్ ఆఫ్‌పారిస్, రంగులు, రసాయనాలతో నిర్మిస్తున్నారు. అటువంటి వాటిని నీటిలో వెయ్యటం మంచిది కాదు. అందువల్ల జలము, తదుపరి

వాయువు కలుషితమౌతాయి. అగ్నిహోత్ర గణపతిని ఆ విధంగా చెయ్యకూడదు. అగ్నిని నీటిలో వేస్తే దాని అస్తిత్వమే సమాప్తం అవుతుంది కదా! వేద మంత్రాలను సరిగా అర్థం చేసుకోనందున కూడా ఈ పొరబాటు ప్రారంభమై ఉండవచ్చు. ఋగ్వేదం (8-102-5)లో **"అగ్నిం సముద్రవాససమ్"** అనే వాక్యం, అట్లే ఋగ్వేదం 10-46-1లో "సీదద్ + అపామ్ + ఉపస్థే" అనే వాక్యం కనబడతాయి. వీటి భావమేమంటే - **"అగ్ని సముద్రంలో వసిస్తుంది, నీటిలో కూర్చుంటుంది"** అని అయితే నీటిలో ఉండే అగ్ని మన వంటింట్లో ఉండే సామాన్య అగ్నివంటిది కాదు. అది ఒకరకమైన విద్యుదగ్ని. దానిని వేదం **"విశ్వ శంభువాగ్ని"** అంటుంది. ఈ క్రింది మంత్రాన్ని పరిశీలించండి -

ఓం అప్సుమే సోమో అబ్రవీత్+అంతర్విశ్వాని భేషజా।
అగ్నిం చ విశ్వశంభువమ్ ఆపశ్చ విశ్వభేషజీః॥

- ఋగ్వేదం (1-23-20)

నాతో సోముడు (సృష్టికర్తయైన పరమేశ్వరుడు) "జలంలో సమస్తరోగాలను పోగొట్టగల రోగ నివారక శక్తులున్నాయి. మరియు దానిలో విశ్వశంభువాగ్ని (ఒకరకమైన విద్యుత్) ఉంది. అందుచే జలం విశ్వభేషజం" అన్నాడని ఒక ప్రకృతి వైద్యుడు చెప్పినట్లుంది ఈ మంత్రం. నిజంగా జలంతో చికిత్సలు (Hydratherapy) చేసి చాలా రోగాలు పోగొట్టవచ్చు. వివరాలు నా రచన "వేదాలలో జలచికిత్సా విజ్ఞానం" అనే పుస్తకంలో చూడండి.

బహుశః విశ్వశంభువాగ్ని అంటే - నీటిలో ఉన్న ఉదజనిని (హైడ్రోజన్‌ను) వేరు చేసి దానితో వాహనాలను, పరిశ్రమలను నడిపించటం కావచ్చు. ఆ మధ్య దినపత్రికలలో ఒక యువ విజ్ఞానవేత్త నీటితో చిన్న కారు నడిపారని వార్త. ఆ టెక్నాలజీతో బహిర్గతమయ్యేదే విశ్వశంబువాగ్ని కావచ్చు.

మనకు సరిగా తెలియటం లేదుకాని సముద్రంలో ఏదో అగ్ని ఉంది. మన ఇతిహాస గ్రంథాలలో అక్కడక్కడ 'బడబానలం' అనే మాట కనబడుతుంది. బడబానలం అంటే సముద్రాగ్ని అని అర్థం. కొన్ని అరుదైన పరిస్థితులలో అది వ్యక్తమౌతూ ఉంటుందట. నా అనుభవంలోని ఒక విషయం ఏమంటే - సుమారు

30 సంవత్సరాల క్రిందట కృష్ణాజిల్లా సముద్ర తీర ప్రాంతంలో జరిగిన ఉప్పెన బీభత్సం తరువాత రెండవ విడత సహాయక బృందంలో నేను కూడా పాల్గొని ఆ ప్రాంతం సంచరించాను. అక్కడివారు ఆనాటి అనుభావాలను చెబుతూ ఉప్పెన సమయంలో సముద్రంలో ఎత్తైన కెరటాలు లేవటమేకాక ఊర్లు తగులబడుతున్నట్లు దూరంగా పెద్దపెద్ద అగ్ని జ్వాలలు కనబడ్డాయన్నారు. అవి పిడుగులు కాకపోవచ్చు. పిడుగు క్షణకాలమే ఉంటుంది కదా! ఇంతేగాక అక్కడి తీరప్రాంత మత్స్య కారులు కొందరు ఆ సమయంలో ఆ రాత్రంతా సముద్రంలో ఈదుతూ గడుపవలసి వచ్చిందట. వారు బడబనలాన్ని స్వయంగా చూశామనీ, అప్పుడు ఆ సముద్రజలం గోరువెచ్చగా ఉందనీ, ఆ కారణంగానే భయంకరమైన చలిగాలులు వీస్తున్నా చలిని తట్టుకుని బ్రతికి బయట పడ్డామని చెప్పారు. అప్పుడు ఈ విషయాలు కొన్ని దినపత్రికలలో వచ్చాయి. కాని, ఆధునిక వైజ్ఞానికులకు ఇంతవరకు కూడా బడబనాలగ్ని అంటే ఏమిటో అర్థంకావటం లేదు.

ఇక గణేశ నిమజ్జన విషయానికివస్తే మన పెద్దలు స్వతంత్ర సంగ్రామం చేసే సమయంలో మాన్యశ్రీ బాలగంగాధర తిలక్ గారు హిందువుల సామూహిక బలాన్ని ఆంగ్లేయులకు చూపటానికి బొంబాయి నగర ప్రజలను సామూహిక నిమజ్జన కార్యక్రమం జరుపుకుందామనే పిలుపునిచ్చారు. దానికి చాలా చక్కటి స్పందన లభించి జయప్రదమయ్యింది. అప్పటి నుండి అది ఇక ముఖ్య ఆచారంగా స్థిరపడి క్రమంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు, తెలంగాణాలోని హైదరాబాద్‌కు ప్రాకింది. ఇప్పుడిప్పుడు ఆంధ్రా తమిళనాడు రాష్ట్రాలలోని నగరాలకు, పట్టణాలకు ప్రాకుతున్నది. సత్యమైన ఆచారం వ్యాపించటానికి చాలా సమయం పడుతుంది - కాని మూఢనమ్మకాలు తొందరగా వ్యాపిస్తాయి కదా! దీనివల్ల ఎంతో అపవ్యయం, సమయనష్టం, ట్రాఫిక్ యిబ్బందులు కలుగుటయేకాక కొన్ని అధర్మ దోషాలు కూడా కలుగుతున్నాయి. పేద మధ్యతరగతి బస్తీప్రజలను బాధించి, భయపెట్టి చందాలు ప్రోగుచెయ్యటం, వాటిని విలాసాలకు, వ్యసనాలకు ఖర్చుపెట్టడం, వాతావరణ కాలుష్యాన్ని శబ్దకాలుష్యాన్ని పెంచటం వంటివి కలుగుతున్నాయి.

భక్తి ఆంతరంగికం. భగవద్గీతలోని 12వ అధ్యాయం భక్తి యోగం మనకు ఇదే బోధిస్తున్నది. అందులో ఉపదేశింపబడిన భక్తుని లక్షణాలు మనలో పెంచుకొని

సర్వాంతర్యామియైన గణపతికి దగ్గరకావటం ఉత్తమం. వీలైనంత ఎక్కువగా పరోపకారంచేస్తూ పుణ్యజీవులం కావటం మధ్యమం. వ్యాస మహర్షి తమ బృహత్ గ్రంథమైన మహాభారతంలో కోటి ధర్మ గ్రంథాలసారాంశం అర్థ శ్లోకంలో చెప్పారు. వారు ఏమన్నారంటే -

"శ్లో॥ శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః,

పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్॥

పుణ్యం కావాలనుకుంటే పరోపకారం చెయ్యండి. పాపం కావాలనుకుంటే పరులను పీడించండి" అన్నారు. కనుక వివేకవంతులు ఆలోచించండి. గణపతి నవరాత్రులకొరకు ఖర్చుపెట్టే ధనాన్ని సామాజిక సేవకు - అందరికి ఉపయోగపడే నిర్మాణాత్మక కార్యాలకు ఖర్చుపెట్టండి. ఆదర్శంగా జీవించి ఆత్మోన్నతిని పొందండి. అస్తు.

<u>విద్యా గణపతి - ఆచార్య గణపతి</u>

మనం ఇంతవరకు గణపతి పదమునకు ఆధ్యాత్మికార్థంలో సర్వవ్యాపకుడు, అజుడు అనాదియైన పరమేశ్వరుడనీ, ఆధిదైవికార్థంలో -33 రకాల దేవతలలో అగ్నిహోత్ర కార్యమనీ తెలుసుకున్నాము. ఇక ఆధిభౌతికార్థాన్ని గురించి తెలుసుకోవలసి ఉంది. ఆధిభౌతికార్థం అంటే భూతముల పరంగా - ప్రాణుల పరంగా లేదా మానవుల పరంగా అని అర్థం. గణపతిలోని మూలార్థం(గణ - సంఖ్యానే) ఒక సమూహానికి పతి - పాలకుడు, రక్షకుడని పూర్వ పుటలలో తెలుసుకున్నాము. అట్టి మానవ సమూహంలో గణపతి విశేషణం ఆ దేశ రాజునకు వర్తిస్తుంది. ఇప్పుడు రాచరిక వ్యవస్థ లేదు కనుక ప్రభుత్వం అని అర్థం చెప్పుకోవాలి. అనంతరం సేనాపతులను భూ వాయు సముద్ర సేనాపతులను గణపతులనవచ్చును. వారు ఆయా సైన్యసమూహానికి అధిపతులు కనుక. అట్లే, ఆ యా రాష్ట్రాల పతులను, సమాజాల సంఘాల సంస్థల అధిపతులు కూడా ఆ సీమిత సంస్థలకు గణపతులౌతారు. అందుకనే యజుర్వేద 16వ రుద్రాధ్యాయం రుద్రులు, గణపతులు అనేకులంటూ <u>"నమో గణేభ్యః గణపతిభ్యశ్చ వో నమః</u> (16-25)" అంటూ బహువచనంలో నమస్కారాలు చెబుతుంది.

గణతంత్ర దేశంలో గణాధ్యక్షుని - రాష్ట్రపతిని గణపతి అంటారు. శ్రీగణేశ మహిమస్తోత్రంలో "గణాధ్యక్షో జ్యేష్ఠః" అని చెప్పబడింది. నేటి గణపతి విగ్రహం ఒక ఆదర్శ గణాధ్యక్షునికి ప్రతీక. బుద్ధి వివేకాలు ఏనుగుతలవలె పెద్దగా ఉండాలనీ, ప్రజలందరి మాటలను శ్రద్ధగా వినాలని పెద్ద పెద్ద చెవులు సూచిస్తున్నాయి. చాలా తక్కువగా మాట్లాడాలని చిన్న నోరు, కుశాగ్ర బుద్ధి ఉండాలని పొడవాటి ముక్కు (తొండము) సూచిస్తాయి. అధ్యక్షుడు మితభాషి కావాలి. నోరు జారితే చాలా చిక్కులొస్తాయి కనుక ముక్కు ప్రతిష్ఠకు చిహ్నం. దానికి ఏదైనా హాని జరిగితే ముక్కు తెగినంత పని జరిగిందంటారు పెద్దలు. ఏనుగుకు రెండు రకాల దంతాలుంటాయి. 1. భయటకు కనబడేవి 2. లోపల ఉండేవి (నమలటానికి). ఇవి కూటనీతిని సూచిస్తాయి. కౌటిల్యుని అర్థశాస్త్రం యిదే చెబుతుంది. గణేశుని విరిగిన దంతం అతని వీరత్వాన్ని సూచిస్తుంది. వీరుడు పోరాడేటప్పుడు శత్రువు చేతిదెబ్బలు కూడా కొన్ని తాను తినవలసి వస్తుంది కదా! లంబోదరము ప్రజలందరి కడుపులు నింపాలనీ, ధన కనక వస్తు వాహనాలన్నీ సమృద్ధిగా ఉండాలని సూచిస్తుంది. మూషకము రైతుల కష్టాన్ని దోచుకుంటుంది. అది ఒక దొంగ. కనుక రాజు దొంగలను దోపిడీగాండ్రను అణచిపెట్టి వారిపై స్వారీ చెయ్యాలి. గణేశుని చేతులలోని పాశము, అంకుశము, గదా, పుస్తకం మొదలైనవి విధాన నియమాలను, అధికారాన్ని, శాసనాలను సూచిస్తాయి. ఇట్లే, మిగతావన్నీ గణాధ్యక్ష గణపతికి (రాజుకు) ఉండవలసిన గుణగణాలను సూచిస్తాయి. ఇట్టి ప్రత్యాయనీయాలను గ్రహించటానికి బదులు ప్రతీక అయిన గణపతి విగ్రహాలకు పూజలు చేస్తే సరిపోతుందను కోవటం ఎంతమాత్రం మంచిదికాదు.

అందరి గురించి ఇక్కడ తెలపటం కష్టం; బుద్ధిమంతులు ఆలోచించి గ్రహించగోరుచున్నాము. ముఖ్యంగా విద్యాగణపతి, ఆచార్యగణపతులను గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాము.

<u>విద్యాగణపతి :-</u> గణపతికి అసలు పెండ్లేకాలేదని కొన్ని పురాణాలు చెబుతూ ఉంటే - కొన్ని పురాణాలు బుద్ధి, సిద్ధి అనబడే ఇద్దరు భార్యలున్నట్లు చెబుతాయి. ఈ యిద్దరిని కొన్ని పురాణాలు లక్ష్మీ సరస్వతులన్నాయి. కొన్ని చోట్ల లక్ష్మీగణపతియనీ, కొన్ని చోట్ల సరస్వతీగణపతియని చెప్పారు. ఆలోచించి చూస్తే సరస్వతి విద్యకు ప్రతీక (చిహ్నము). లక్ష్మి ఐశ్వర్యానికి ప్రతీక (చిహ్నము). ఈ రెండు నిత్యాగ్ని హోత్రులకు లభిస్తాయంటుంది వేదం.

1. **'ఈజానాః స్వర్గంయన్తి లోకమ్'** - అథర్వవేదం (18-4-2). తరచుగా యజ్ఞాలు చేసేవారు స్వర్గలోకాన్ని పొందుతారు. (స్వర్గలోకం అంటే ఎక్కువ సుఖాలతో కూడిన జన్మ. వేరే ప్రత్యేకలోకం కాదు)

2. **'హోతృ + సదనం హరితం హిరణ్యయమ్'** - అథర్వవేదం (7-99-1). నిత్యాగ్నిహోతృని యిల్లు పచ్చగా పాడిపంటలతోను, హిరణ్యమయంగాను అవుతుంది.

అంటే సమృద్ధితోను, ఐశ్వర్యంతోను కళకళలాడుతుందని గ్రహించాలి. ఎక్కడ ఈ రెండూ ఉంటాయో అక్కడ సంతోషమే సంతోషం ఉంటుంది. అందుకనే అగ్నిహోత్ర గణపతికి సంతోషమనే కుమార్తె ఉన్నట్లు ప్రచారం జరిగింది. వ్యాకరణం ప్రకారం సంతోషి పదము పులింగంలో ఉంది. దానిని స్త్రీలింగంగా మార్చాలంటే సంతోషిణి అవుతుంది. కనుక సంతోషిణీ మాత అంటే సరిగా ఉంటుంది.

కొందరు విద్వాంసులు గణపతి బుద్ధికి అధిదేవతగా వ్యాఖ్యానించారు. ప్రజలలోనూ ఆ నమ్మకమే ఉంది. నేను విద్యార్థిగా ఉండే రోజులలో మా తల్లితండ్రులు తరగతి పుస్తకాలన్నిటిని వినాయకుని పాలవెల్లి క్రింద పెట్టించి పూజ చేయించేవారు. మాకు చదువుకు 1,2 రోజులు సెలవు దొరికేది. హఠయోగ ప్రదీపికను నమ్మేవారు మన శరీరంలో వెన్నెముక పొడవునా షట్చక్రాలు (ఊహా చక్రాలు) ఉంటాయని నమ్ముతారు. వారు వెన్నెముక చివర మూలాధార చక్రం ఉంటుందనీ, దానికి అధిదేవత గణపతియని అంటారు. అక్కడ మనస్సును ధారణ చేస్తే తేలికగా సుషుమ్నా నాడి జాగృతమై మెదడులో ఉండే సహస్రార చక్రం వరకు ఎగబ్రాకుతుందనీ, దానితో బుద్ధి వికాసంతో బాటు వివేక జ్ఞానం కలిగి అవిద్య (అజ్ఞానం) నశించి ఆత్మసాక్షాత్కారం కలుగుతుందంటారు. అనంతరం సర్వంతర్యామి సాక్షాత్కారం కలుగుతుందనీ, బుద్ధి ఋతంభరాప్రజ్ఞ వరకు వికసించి జ్ఞానతృప్తి, పరమానందం కలుగుతాయని యోగులు చెబుతారు.

గణపతికి లక్ష్మీ సరస్వతులు - భార్యలంటే - అగ్నిహోత్రంవల్ల లక్ష్మి (సమృద్ధి), సరస్వతి (విద్యాబుద్ధులు) లభిస్తాయని గ్రహించాలి.

ఆచార్య గణపతి :- పూర్వకాలంలో విద్యాలయాలు గ్రామాలకు దూరంగా ఉపవనాలలో ఉండేవి. వాటిని గురుకులాలు అనే వారు. స్త్రీలకు వేరుగా, పురుషులకు వేరుగా దూరదూరంగా ఉండేవి. వారి భోజన వస్త్రాదులకు రాజులు, ప్రజలు తగిన ఏర్పాట్లు చేసేవారు. విద్యాభ్యాసం పూర్తయ్యేవరకు విద్యార్థులు గురుకులంలోనే ఉండాలనీ, ఇంటికి పోకూడదనీ నియమం ఉండేది. దానికి ఒక ఆచార్యులు ఉండేవారు. ఆయన కొందరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకొనిగాని, లేదా తన వద్ద చదువుకున్న పెద్ద శిష్యుల సహకారంతోగాని విద్యలు నేర్పించేవారు. ముఖ్య గురువుగారినే ఆచార్యులు అనేవారు. వారికి కులపతులని మరియొక పేరు. అంటే గురుకుల పతులని (Head Master or Principal) అని అర్థం. అట్టి ఆచార్యుల కుండవలసిన గుణగణాలను వింత వినాయక విగ్రహం సూచిస్తున్నదని కొందరు విద్వాంసులు వ్యాఖ్యానించారు.

ఆ ప్రకారంగా లంబోదరం గురుకులంలో వసించే పిల్లలందరిని ఆచార్యుడు తన కడుపులో పెట్టుకున్నట్లుగా వారి ఆహార వస్త్రాదులనన్నిటిని సమకూర్చాలని, భిక్షను అందరూ పంచుకు తినాలని సూచిస్తుంది. గణేశుడు మోదక ప్రియుడు. మోదకం అంటే (ముది – హర్షే) హర్షాన్ని సంతోషాన్ని కలిగించే దీని అర్థం. గురువు శిష్యులతో ప్రసన్నంగా, మధురంగా వ్యవహరించాలని ఇది సూచిస్తుంది. చేతులలోని అంకుశ పాశ పుస్తకాదులు చదువుకోని విద్యార్థులపట్ల కాస్త కరుకుగానే ప్రవర్తించాలని సూచిస్తుంది. పిల్లల ప్రవృత్తి ఆటపాటల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతుంది. కనుక వారి బాగుకోసం పాఠాలు అప్పగించకపోతే కొద్దిగా దండించాలి. అట్లని క్రూరంగా హింసించకూడదు. చేతులో బెత్తెము ఉన్నా మనస్సులో వెన్న ఉండాలి. తల్లివంటి ప్రేమ ఉండాలి.

విద్యార్థులు చదువుతో బాటు సదాచారం నేర్చుకుని సభ్యమానవులు కావాలి. సంస్కారవంతులై ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. అందుకు దండం కొంత అవసరం. లేకుంటే పిల్లలు చెడిపోతారు. కష్టాలపాలౌతారు. విద్యార్థులు మూషకంవలె గురువులందరి నుండి వీలైనన్ని ఎక్కువ విద్యలు గ్రహించి దాచుకోవాలి. అవి జీవితంలో అవసరమైనపుడు చాలా ఉపయోగ పడతాయి. పొలంలోని ఎలుకలు రైతు కష్టాన్ని దొంగిలిస్తాయి. అయితే విద్యాధనం భౌతిక ధనం వంటిదికాదు.

గురువుల నుండి శిష్యులు ఎన్ని విద్యలు సంగ్రహించినా వారి విద్య తరగిపోదు. మీదుమిక్కిలి మరింత వృద్ధి చెందుతుంది. వాహనం అంటే ప్రయాణ సాధనం. గురువుగారు మూషక వాహనుడంటే వారి విద్యలు శిష్యుల ద్వారా లోకంలో దూరదూర ప్రాంతాలకు విస్తరిస్తాయి.

ప్రసిద్ధ వ్యక్తుల దృష్టిలో గణపతి

భారతీయ సంత్ పురుషులుగా ప్రసిద్ధికెక్కిన సంత్ జ్ఞానేశ్వర్ గారు గణపతి ఓంకారానికి సంకేతమని భావించారు. అ+ఉ+మ కలిసి ఓంకార మౌతుంది. ఈ మూడు అక్షరాలు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను సూచిస్తాయి. సృష్టిస్థితిప్రలయకర్తలైన ముగ్గురు దేవతల సంయుక్త రూపమే గణపతి అని తమ జ్ఞానేశ్వరి భగవద్గీత వ్యాఖ్య ప్రారంభంలో అభిప్రాయ పడ్డారు. అక్కడ ఆ దృష్టితోనే గణపతిని గురించి చక్కగా వర్ణించారు. గణేశుని విరిగిన దంతము ఆస్తికవాదం ఎదుట స్వయంగా ఖండితమైన బౌద్ధమతాన్ని సూచిస్తున్నదన్నారు. దీనివల్ల గజానన గణేశుని కల్పన బౌద్ధమత ప్రచారానికి ముందు లేదనే అభిప్రాయం కలుగుతోంది. వారు చెప్పిన మరొక విషయం ఏమంటే –

"హేళబ్ద బ్రహ్మ అశేష, తెచ్చి మూర్తి సురేఖ" అంటూ మొదలుపెట్టి 6 దోహాలుగా వ్రాశారు. వాటి సారాంశమేమంటే – గణేశుని ప్రతిమ శబ్దబ్రహ్మవేదం యొక్క ప్రతీక. గణేశుని వివిధ అవయవాలు స్మృతి గ్రంథాలు. అతని 6 భుజాలు 6 దర్శనాలు. అతని చేతిలోని పరశువు తర్కశాస్త్రాన్ని సూచిస్తుంది. అంకుశం నీతిశాస్త్రం, మోదకం వేదాంతం, ఖండితమైన దంతం బౌద్ధమతం. రెండు చెవులు మీమాంసా శాస్త్రాలు పూర్వ మిమాంస, ఉత్తరమీమాంస – అంటే వేదాంత దర్శనం. అతని చెవులవద్ద తిరిగే భ్రమరాలు విద్వత్ గణములు. అవి ఆయన చెవులవద్ద శాస్త్రాల అధ్యయనం చేస్తున్నాయి. ఆనంద మధుపానం చేస్తున్నాయి." అని అన్నారు.

సంత్ తుకారాం గారు కూడా గణపతి విగ్రహం ఓంకారానికి ప్రతీకగా ఉందన్నారు. ప్రొఫెసర్ మోనియర్ విలియమ్స్ గణేశుడు శూద్రుల దేవతయని భ్రమపడ్డారు. ప్రొ. అలింసగేటిగారు గణపతి ద్రవిడుల దేవతయన్నారు. గణేశుడు ముందుగా ద్రవిడుల దేవతగానే ఉన్నాడు, తరువాత ఆర్యులు కూడా అతనిని స్వీకరించారని డా॥ సంపూర్ణానంద స్వామి గారు అన్నారు. అష్టాదశపురాణాల్లో

రకరకాలుగా గణపతిని గురించి వ్రాయటం వల్లనే పై వ్యక్తులకు అన్ని రకాలుగా అభిప్రాయాలు కలిగాయి. చరిత్రలోను గణపతి నామముగల వ్యక్తులు కొందరున్నారు. ముఖ్యంగా మహాభారతం వ్రాసిన గణపతి గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాము.

<u>మహాభారతం వ్రాసిన గణపతి</u>

పూర్వం వేదంలో చెప్పబడిన భగవంతుని నామములతో తమ పిల్లకు నామకరణం చేసుకునే వారు. ఆ నామములలో గణపతి నామం ఒకటి. కనుక, గణపతి పేరుగల ఎందరో వ్యక్తులు చరిత్రలో ఉండి ఉంటారు. ఇప్పుడును కొందరున్నారు. భవిష్యత్తులోను కొందరుంటారు. అందుచేత చరిత్రలో కనబడే గణపతులు మనం నేడు చూసే గణపతి విగ్రహంలాటి వారు కారు. అందరూ మహాదేవుని లేదా పార్వతి సంతానం కాదు. చరిత్ర పరిశోధకుల వివరణ ఏమంటే–

వేదవ్యాస మహర్షికాలంలో మాలతీనది ఒడ్డున 'మహాదేవుడు' అని పేరుగల ఒక గొప్ప యోగిపుంగవుడు ఉండేవాడు. అతడు పూర్ణవిద్వాంసుడు. అతడు 'పర్వతరాజు' అను పేరుగల ఒక రాజుయొక్క కుమార్తెయైన పార్వతిని వివాహ మాడాడు. పార్వతి కూడా విదుషీమణియే. యోగినియే. వారి సంతానమే మహా భారతకాలంనాటి గణపతి. అట్టి ఉత్తములకు పుట్టిన సంతానం కావటంవల్ల గణపతి విద్వాంసుడు మరియు యోగి అయ్యాడు. ఆ గణపతి "గణేశగీత" అనే పేరుతో రాజయోగానికి చెందిన ఒక పుస్తకం వ్రాశారనీ, అది ఇప్పుడు కూడా లభిస్తున్నదనీ కొందరు పరిశోధకులంటున్నారు. ఇతడు శీఘ్రలేఖకుడు కూడానట. ఎవరైనా చెబుతూ ఉంటే దానిని వేగంగాను, పొరబాట్లు లేకుండగాను వ్రాయగల సమర్థుడట. అందుచే వ్యాసులవారు మహాభారతం వ్రాయటానికి వీరిని ఎన్నుకొన్నారు.

వీరికన్న పూర్వం కూడా ఎందరో గణపతి నామం గలవారు ఉండి ఉంటారు. రామాయణ కాలంలో ఇప్పటి కేదార్‌నాథ్ క్షేత్రంలో 'శివుడు' అనే పేరుగల గొప్ప విద్వాంసుడు, యోగి, అస్త్రశస్త్ర విద్యలు నేర్చిన ఒక గొప్ప వ్యక్తి ఉండెనట. అతని కుమారుడును గణపతియే నంటారు. మన ఇతిహాస గ్రంథాలలో ఎన్నో ప్రక్షిప్త కథలు చేరాయి. కొన్ని పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఈ కలగలపు కథలలో ఏది ఎంతవరకు సత్యమో తెలియటం లేదు. ఏమైనప్పటికి మానవశరీరం ఏనుగుతల గలిగిన గణపతి ఎవరూ ఉండరు. ఇది అసంభవ విషయం. అందుచే దీనిని ఒక

ప్రతీకగా – సంకేతంగా తీసుకొని ప్రేరణ పొందటమే ఉత్తమం. అంతేకాని, ప్రతీకలకు – గుర్తులకు షోడశోపచార పూజలు చేస్తూ కాలాన్ని, ధనాన్ని వ్యర్థం చేసుకోవటం మంచిది కాదు. మీరేమంటారు?

<u>ముగింపు మాటలు</u> **(Conclusion)**

ప్రియపాఠకులారా!

గణపతిని గురించి మరికొన్ని విషయాలున్నాయి. కాని, గ్రంథవిస్తరణ భీతిచే ముగింపు వైపుకు పయనిస్తున్నాము. ప్రారంభ పుటలలో తెలిపినట్లుగా మనం వేదధర్మాలను అనుసరించే వైదికులము. కేవలం నాలుగు వేదాలు మాత్రమే ఈశ్వరీయాలు. మిగిలిన అంగ ఉపాంగ బ్రాహ్మణ ఆరణ్యక ఉపనిషదాదులన్నీ ఋషులు వ్రాసినవి. వేద పదములన్నీ యౌగికాలు. ఆ పదములకు మూలమైన ధాతువులలో (Roots లో) ఉండే అర్థాలే ఆ పదములకు సరియైన అర్థాలు. వాటిని ఆ యా ప్రకరణాలను (సందర్భాలను) బట్టి 4,5 రకాలుగా అర్థాలు చెప్పుకోవచ్చు. కాని, ఆధ్యాత్మిక ఆదిభౌతిక ఆధిదైవికములనే మూడు రకాల అర్థాలే ముఖ్యమైనవి. ఆధియాజ్ఞిక, ఆధిజ్యోతిష పరమైన అర్థాలు కూడా చెప్పవచ్చునని కొందరంటారు. ఈ రెండింటినీ ఆధిదైవికార్థంలో కలిపివేయవచ్చు.

ఆధ్యాత్మికార్థంలో గణపతి అంటే జీవ గణాలకు, ప్రాకృతిక గణాలకు అధిపతియైన పరమేశ్వరుడని అర్థం చెప్పుకోవాలి. ఆ ప్రయత్నంగా ఋగ్వేద, యజుర్వేద మంత్రాలు రెండింటి అర్థం చెప్పటం జరిగింది. మరికొన్ని మంత్రాలు ప్రార్థనలుగా అట్టపైన వ్రాశాము. అట్టి సర్వవ్యాపక గణపతికి మనం ప్రతీక= ఆకారం, చిహ్నం కల్పించలేము. ఒకవేళ కల్పించాలనుకుంటే ఋగ్వేద హిరణ్యగర్భ సూక్తం (ఋ. 10-12)లో ఉన్నట్లుగా లేదా యజుర్వేద 31వ. అధ్యాయం పురుష సూక్తం లో.... ఉన్నట్లుగా కల్పన చెయ్యాలి. వాటిని ప్రతీకలుగా – విగ్రహాలుగా చెయ్యలేము. సర్వ వ్యాపక సచ్చిదానందునికి ఏ ఆకారాన్ని కల్పించగలము? షోడశోపచారపూజ లెట్లు చేయగలము? ఎవరైనా ఆ ప్రయత్నం చెయ్యదలిస్తే ముందుగా ఆదిశంకరాచార్యుల వారు "పరాపూజ" పుస్తకంలో ప్రశ్నించిన ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి ఉంటుంది. వారేమని ప్రశ్నించారంటే –

"శ్లో॥ పూర్ణస్యావాహనం కుత్ర, సర్వాధారస్య చాసనమ్ ।
స్వచ్ఛస్య పాద మర్ఘ్యం చ, శుద్ధ స్యాచమనం కుతః ॥

సర్వవ్యాపక పరబ్రహ్మ లేని దెచట? అతనిని ఆవాహం చేయటమెలా? ఆవాహయామి, స్థాపయామి, పూజయామి అంటూ చేసే షోడశోపచార పూజ ఎట్లా సాధ్యం? సర్వాధారునికి ఆసనమెలా సాధ్యం? సదా పరిశుద్ధుడైన పరమాత్మకు స్నానం, అర్ఘ్యపాద్య ఆచమనాదు లెందుకు?" అంటూ 10,15 శ్లోకాలలో ప్రశ్నించారు. కనుక లోకంలో మనం చూసే గణపతి విగ్రహం పరమాత్మకు ప్రతీక కాజాలదు.

ఇక రెండవది ఆధిభౌతికార్థం. ఆ ప్రకారం గణపతి పదము రాజునకు, గురుకులాచార్యునికి వర్తిస్తుంది. వారికి ప్రతీకగా గణపతి విగ్రహాన్ని వర్తింపచేయవచ్చు. వాటిని సంక్షిప్తంగా ఈ పుస్తకంలో చర్చించటం జరిగింది.

మూడవది ఆధిదైవికార్థం. ఆ ప్రకారం అగ్నిహోత్రమే గణపతి అవుతుంది. అది ప్రాణిగణములను, ప్రకృతిగణములను కూడా తన సీమిత శక్తితో పాలిస్తుంది పోషిస్తుంది. ఎంత ఎక్కువగా దానిలో ఆహుతులు వేస్తే అంత ఎక్కువగా ప్రాణులకు మేలు చేస్తుంది. విగ్రహ గణపతిని గురించిన విశేషణాలలో ఎక్కువభాగం అగ్నిహోత్రానికే వర్తిస్తున్నాయి. ఆ విషయాలు వివరంగా ఈ పుస్తకంలో చదివారు కదా !

బహుశః మన దేశంలో బౌద్ధ జైన మతాల ప్రభావంతో ప్రజలు అగ్నిహోత్రానికి దూరమై దాని స్థానంలో అగ్నిహోత్రానికి ప్రతీకయైన విగ్రహగణపతి పూజ చేయటానికి అలవాటుపడి ఉంటారు. అందుకనే ప్రతీ శుభకార్యానికి ముందు విగ్రహగణపతి పూజ చేయించటానికి అలవాటుపడి ఉంటారు. సృష్ట్యాదినుండి మహాభారతకాలం వరకు శుభకార్యాలన్నీ అగ్నిహోత్ర పూర్వకంగానే జరిగేవి.

దానికి బదులు నేడు విగ్రహగణపతి పూజ చేయించి వివాహాది శుభకార్యాలు జరుపుకుంటున్నారు. చివరికి శివపార్వతుల కల్యాణం జరుపాలన్నా ముందు గణపతి పూజ చేయిస్తున్నారు. అగ్నిహోత్ర కార్యంవల్ల జరిగినంత కాలుష్య నివారణ గణపతి పూజవల్ల జరుగుతుందా?

ప్రతీకలే విగ్రహాలయ్యాయి

ప్రారంభంలో ప్రతీకలు హాస్యచిత్రాలుగా లేదా ఆలోచింప చేసే కార్టూన్స్‌గా వేసి ఉంటారు. అవి క్రమంగా విగ్రహాలై ఉంటాయి. చదుర్వేదవేత్తను తెలుపటానికి బ్రహ్మ చిత్రం, రాజుల కర్తవ్యాలను. ధర్మాలను తెలుపటానికి విష్ణుమూర్తి చిత్రం, ప్రలయంచేసే వ్యక్తిగా రుద్రుని చిత్రం, శక్తికి చిహ్నంగా దుర్గా దేవి చిత్రం గీసినట్లే అగ్నిహోత్ర గుణాలను తెలిపే వినాయక మూర్తిని చిత్రించి ఉంటారు. వాటిని క్రమంగా శిల్పులచే విగ్రహాలుగా చెక్కించి పూజాపాఠాలు రూపొందించి షోడశోపచారపూజలకు అలవాటుపడి ఉంటారు. నెమ్మది నెమ్మదిగా పవలింపు సేవలు, సుప్రభాతాలు, స్తోత్రాలు, అష్టోత్తరశతనామాలు వ్రాసి ఉంటారు. అవన్నీ ఇప్పుడు బలపడి పోయాయి. అసలు దేవుని స్వరూప స్వభావాలు తెలియకుండా అయిపోయాయి.

ప్రతీకల పూజ ఎట్లుంటుందంటే – గోపూజ చెయ్యాలంటే గోవు చిత్రానికో విగ్రహానికో పూజ చేయటంలా తయారయ్యింది. దేశ భక్తి కలిగి ఉండాలంటే జాతీయ జండాకు పూజ చేసినట్లు, కార్మిక కర్షక సంక్షేమానికి కృషి చెయ్యవలసింది పోయి. కమ్యూనిస్టుల జండాను పూజించినట్లుంటుంది.

అగ్నిహోత్ర కార్యానికి దేవయజ్ఞం, దేవపూజ అనే పర్యాయపదాలున్నాయి. దేవపూజ చెయ్యమంటే అగ్నిహోత్ర కార్యం చెయ్యాలన్నమాట. అది నేడు గణపతి పూజగా మారింది. ఏమైనప్పటికి అగ్నిహోత్ర కార్యంవల్ల జరిగే వాతావరణ కాలుష్య నివారణాది లాభాలు విగ్రహగణపతి పూజవల్ల కలుగవు. కనుక జడ దేవీదేవతల పూజలకు బదులు అగ్నిహోత్ర కార్యం చెయ్యటమే సర్వవిధాలా మంచిది. మీరంతా బుద్ధిమంతులే కనుక మీరు కూడా ఆలోచించండి. భౌతిక శాస్త్ర సంకేతిక రంగాలలో మన బుద్ధి విమానంలా దూసుకు పోతున్నది కాని ధార్మిక విషయాలలో, కార్యాలలో అది జరగటం లేదు. ఇప్పటినుండైనా దేవుడు మన కిచ్చిన బుద్ధిని ఆ విషయాలలో ప్రయోగిద్దాము రండు.

"సబ్ కా మాలిక్ ఏక్‌హై" – అందరికి దేవుడొక్కడే. అని సంతులు, యోగులు, మహాత్ములు, జ్ఞానులు ఎందరో ఉపదేశించారు. ఇతర మతాలవారు ఒక దేవుడినే నమ్ముతారు. కాని హిందువుల విషయంలో ఏకేశ్వరవాదం ప్రభావం చూపటం

లేదు. అనేక దేవీ దేవతల ఆలయాలు, ఒక గుడిలోనే 3,4 రకాల దేవతామూర్తులు, + నవగ్రహాలు, నందులు, క్షేత్రపాలకులు. ఒక దేవునికి లడ్డూయిష్టం, మరొకరికి హల్వా(సీరా) యిష్టం. ఇలాగే బెల్లం, పానకం, పులిహోర, దద్ధోజనం చక్కర పొంగలి మొదలగునవి ఎన్నెన్నో ప్రసాదాలు. మన విగ్రహ గణపతికి ఉండ్రాళ్ళు యిష్టం. తమలపాకులు కొన్ని దేవతలకు ఇష్టం. పశుబలిని కోరే దేవతలు కూడా ఉన్నారు.

ఇంతేగాక, ఆ దేవుళ్ళకు జన్మవృత్తాంతాలు, వివాహ సంతానాది వృత్తాంతాలు వ్రాశారు. ఇప్పుడు సంవత్సరానికి ఒకసారి ఆ విగ్రహాలకు కల్యాణోత్సవాలు చేస్తున్నారు. కొన్ని దేవుళ్ళకు సంవత్సరానికి 2,3 సార్లు కల్యాణాలు జరిపిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒక దేవునకైతే ప్రతిరోజు కల్యాణం జరుపుతారట. ఆయనకు నిత్యకల్యాణం ఇష్టమట. పవళింపు సేవలు చేసి ఉదయం నిద్రలేపుతున్నారు. దేవుడు అజుడు, అనాది, అకాయుడు, అవ్రణుడు, అస్నావిరుడు నని మనవలె నాడులతో బంధింపబడి ఇంద్రియ సుఖాలు అనుభవించడని వేదాలు, దర్శనాలు, ఉపనిషత్తులు ఘోషిస్తూ ఉంటే ఈ కర్మకాండ లేమిటి? బుద్ధిమంతులు ఆలోచించండి. భౌతిక శాస్త్రసాంకేతిక రంగాలలో ప్రయోగిస్తున్న తార్కిక బుద్ధిని ఆత్మపరమాత్మల విషయంలో కూడా వినియోగించమని మా విన్నపం. అస్తు.

ఓ3మ్ శాంతిః శాంతిః శాంతిః.

ఓం ని షు సీద గణపతే గణేషు త్వా మాహుర్ + విప్రతమం కవీనామ్।
న ఋతే త్వత్+క్రియతే కిం చనారే,మహామర్కం మఘవన్+చిత్రమర్చ ॥

– ఋగ్వేదం (10-112-9).

గణములకు స్వామివైన ఓ గణపతీ! సర్వవ్యాపక సర్వేశ్వరా! నీవు మా గణముల మధ్య ఆసీనుడవుకమ్ము. కవులలో నీవు విప్రతముడవు – అత్యంత జ్ఞానివి. నీ సహకారములేక మేము కించిత్ కర్మకూడా చేయలేము. దేనినీ దగ్గర చేయలేము, దూరం చెయ్యలేము. హే మఘవన్! సర్వైశ్వర్య నిధీ! నీవు మహాన్ – చాలా గొప్పవాడవు. పూజ్యుడవు. కీర్తించ తగినవాడవు. మా స్తుతి పాఠములను మన్నించుము. మమ్ము నీ దరి చేర్చుకొమ్ము.

ఆర్యసమాజ నియమములు

1. సమస్త సత్యవిద్యలకును, విద్యవలన నెఱుంగదగు సర్వ పదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు.
2. ఈశ్వరుడు – సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తి మంతుడు, న్యాయకారి, దయాళుడు, అజన్ముడు, అనాది, అనంతుడు, నిర్వికారుడు, అనుపముడు, సర్వాధారుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు సృష్టికర్తయునై యున్నాడు. అతనినే ఉపాసించుట యోగ్యము.
3. వేదము సమస్త సత్యవిద్యల గ్రంథము. దీనిని చదువుట – చదివించుట, వినుట వినుపించుట, ఆర్యుల కందఱికి పరమధర్మము.
4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును నెల్లప్పుడు సిద్ధముగా నుండవలెను.
5. సకల కార్యములను ధర్మానుసారముగా, సత్యాసత్యములను విచారించి చేయవలెను.
6. ప్రపంచమునకు ఉపకారము చేయుట, యీ సమాజము యొక్క ముఖ్యోద్దేశము అనగా శారీరకోన్నతికి, ఆత్మికోన్నతికి మరియు సామాజికోన్నతికి పాటుపడవలెను.
7. అందఱితో ప్రేమ పూర్వకముగ, ధర్మానుసారముగ యథా యోగ్యముగ వ్యవహరింపవలెను.
8. అవిద్యను నశింపజేసి, విద్యను పెంపొందింప జేయవలెను.
9. ప్రతి వ్యక్తియు తనయున్నతితోనే సంతృప్తినొందక, అందఱి యున్నతిలోనే తన యున్నతి కలదని తలంపవలెను.
10. సర్వహితకరములగు సామాజిక నియమములను పాలించుటలో పరతంత్రులై వ్యక్తి హితకరములగు నియమములందు స్వతంత్రులగుట అందఱికి తగును.

ఆర్యసమాజం సీతాఫల్‌మండి కార్యక్రమములు

1. యోగ తరగతులు :- ఉదయం 5.30 గం॥ నుండి 7 గం॥ల వరకు స్త్రీ పురుషులకు మరియు సాయంకాలం 5.30 గం॥ల నుండి 7 గం॥ల వరకు స్త్రీలకు మాత్రమే నిర్వహించబడుచున్నవి.
2. దైనిక సంధ్య అగ్నిహోత్రము :- ప్రతి రోజు ఉదయం, సాయంత్రం జరుపబడును.
3. సత్సంగములు :- సాప్తాహిక సత్సంగము-(ప్రతి ఆదివారము), మహిళా సత్సంగము ప్రీతి భోజనముతో పాటు ప్రతి నెల చివరి ఆదివారము, పర్వ సత్సంగములు, పారివారిక సత్సంగములు నిర్వహించబడుచున్నవి.
4. వైదిక విద్యాలయము హైస్కూల్ :- నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మాధ్యములో ప్రభుత్వ పాఠ్యప్రణాలికతో బాటు ధార్మిక శిక్షణ కూడా బోధించబడుచున్నవి.
5. సంస్కారములు :- వైదిక సంస్కారములు జరుపబడుచున్నవి.
6. హోమియో చికిత్సాలయం :- ధర్మార్థ హోమియో చికిత్సలయం ద్వారా సాయంత్రము 5.30 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు సేవలు అందిచబడుచున్నవి.
7. విరాళాలు :- గురుకులాలకు, గోశాలలకు తగు రీతిగా ఆర్థిక సహాయము లందించబడుచున్నవి.
8. ఇతర సమాజములకు :- బలహీన ఆర్యసమాజములకు తగు రీతిగా సహాయము చేయబడుచున్నవి.
9. విపత్సమయాలు :- విపత్సమయాలలో బాధితులకు సహాయము లీయబడుచున్నది.
10. ప్రచారము :- వేద ప్రచారము కొరకు మాసిక కరపత్రాలు మరియు వైదిక సాహిత్య ముద్రణ ఉచిత వితరణ జరుపబడు చున్నవి.

యజ్ఞ మహిమ

ఓం అసవే స్వాహా, వసవే స్వాహా, విభువే స్వాహా, వివస్వతే స్వాహా, గణశ్రియే స్వాహా, గణపతయే స్వాహా + అభిభువే స్వాహా + అధిపతయే స్వాహా, శూషాయ స్వాహా, సంసర్పాయ స్వాహా, చంద్రాయ స్వాహా, జ్యోతిషే స్వాహా, మలిమ్లుచాయ స్వాహా, దివా పతయే స్వాహా॥ - యజుర్వేదం (22-30).

సృష్టికర్త ఉపదేశం

ఓ మానవులారా! అగ్నిహోత్రం చాలా విలువైనది. అందుండి వెడలు వాయువులు ప్రాణులను, అప్రాణులను (పంచభూతాలను) కూడా పవిత్ర పరచి వాటికి పుష్టిని కలిగిస్తాయి.

అవి మీ శరీరాలలోని దశవిధ ప్రాణాలకు, జీవాత్మలైన మీకును మేలు చేస్తాయి. సృష్టిలోని సూర్యుణ్ణి, విద్యుత్‌ను, వాయువును, దుష్టులనణచిపెట్టు వీరులను, రాజులను బలపరుస్తాయి. సర్పములవలె ప్రాకు ప్రాణులకు, సువర్ణానికి, సూర్య చంద్రనక్షత్రాదుల ప్రకాశానికి కూడా మేలు చేస్తాయి. వాటి ప్రకాశాన్ని బలపరుస్తాయి. మలిమ్లుచలను = దొంగలను దోపిడీగాంధ్రను, మోసగాంధ్రను, పరపీడకులను స్వాహా చెయ్యండి. పూర్తిగా అణచిపెట్టండి. మీ దేశాన్ని ప్రకాశపరచుకోండి. ఆహుతులలోని సూక్ష్మాంశం దివపతియైన సూర్యున్ని కూడా చేరి అక్కడి జ్వాలలను సరిచేస్తాయి.

Perform Yajna for the purification of vital breaths, the soul that resides in the body, the pervading air, the sun, the lightning, the air that protects multitude of object, for the hero who chastises the wicked, for the king, for acquiring strength, for the reptiles, for gold, for light of the Sun, Moon and stars, for keeping the thieves under control, and for the Sun that nourishes the day.